₹ 10/-

జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

సంపుటి - 10 పక్షపత్రిక సంచిక - 11

జూన్ 1-15, 2019







## 'ప్రజలందరికీ ఉచితంగా నాణ్యమైన ఆరోగ్యం'... ప్రభుత్వాలకు పూర్తిగా సాధ్యం !

## మోదీ, జగన్‌లకు జేపీ విజ్ఞప్తి

## మేకింగ్ ఆఫ్ మహాత్మా



## స్థానిక సాధికారతకై కలిసి ఉద్యమిద్దాం

## కుల, మత రాజకీయ విభజన సుస్పష్టం







# కెరీర్‌లో విజయానికి 7 సూత్రాలు



కెరీర్‌లో విజయానికి 7 సూత్రాలపై హైదరాబాద్ మాదాపూర్‌లో
జరిగిన శిక్షణా కార్యక్రమంలో ఐటి/ఐటిఇఎస్ ప్రొఫెషనల్స్‌తో
లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్



జన రాజకీయం కోసం...

# లోక్‌సత్తా టైమ్స్

పక్షపత్రిక

జూన్1-15, 2019 సంపుటి - 10 సంచిక - 11

## లోపలి పేజీల్లో...

వారి డిఫాల్టిజమే వీరి హీరోయిజం................. 5

తెదేపా తప్పుల్ని జగన్ కొనసాగించరని........... 8

రూ.30 కోట్లు... 60 కోట్లు... 10,000.......... 11

పెత్తనం ఎక్కువ, పని తక్కువ.. ఈసీ ఎన్నడూ.......12

సంక్షోభంలో ప్రజాస్వామ్యం........................... 14

సంక్షోభంలో గ్రామీణ ఆరోగ్యం........................ 19

మోదీ ప్రభుత్వానికి ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా ............ 26

'స్టార్టప్'... మేకింగ్ ఆఫ్ మహాత్మా ! .................. 29

మన ఫార్మారంగం ఫలితాల్ని 'ప్రజలందరికీ......... 34

## కార్టూన్ కార్నర్



*సంపాదక వర్గం*

**డా॥ జయప్రకాష్ నారాయణ్**
*ప్రధాన సంపాదకులు*

బండారు రామ్మోహన్‌రావు
డా॥ ఆలూరి విజయలక్ష్మి
కె.వి.కుటుంబరావు

## రచనలు పంపండి

'లోక్‌సత్తా టైమ్స్' పత్రికలో ప్రచురణ కోసం వ్యాసాలు, గేయాలు, కార్టూన్‌లు, ఉత్తరాలు ఈ కింది చిరునామాకు పంపండి.

**ఎడిటర్, లోక్‌సత్తా టైమ్స్,**
తులిప్స్ అపార్ట్‌మెంట్స్
6-3-655, ఫ్లాట్ నెం. 407
సివిల్ సప్లయిస్ ఆఫీస్ వెనుక
సోమాజిగూడ, హైదరాబాద్ – 500 082

**ఫోన్ : 040-23310288**
**ఫోన్ / ఫ్యాక్స్ : 040-23311816**

accountsdept@loksatta.org
loksattatimeslsp@gmail.com

## చందా వివరాలు

*జన రాజకీయ వాణి 'లోక్‌సత్తా టైమ్స్' పత్రిక చందాదారులుగా చేరండి... చేర్పించండి. సంప్రదించవలసిన ఫోన్ నం:* **040-23311816**

*విడి ప్రతి : రు. 10 ,*
*ఏడాది చందా : రు. 200*
*మూడేళ్ళ చందా : రు. 500*

*చందా రుసుమును "లోక్‌సత్తా టైమ్స్" ఎకౌంట్ నం: 62007167836,* **SBI** *పంజాగుట్ట బ్రాంచ్, హైదరాబాద్ పేరిట ఆన్‌లైన్ క్రెడిట్ చేసి వివరాలను ఇ-మెయిల్ చెయ్యవచ్చు.*

IFSC No: SBIN0020072

## లోక్‌సత్తా ప్రకటన రేట్లు

| | బ్లాక్ & వైట్, | మల్టీకలర్ |
|---|---|---|
| సగం పేజీ | ₹ 2,500 | |
| పూర్తి పేజీ | ₹ 5,000 | ₹ 10,000 |
| సెంటర్ స్ప్రెడ్ | ₹ 10,000 | ₹ 20,000 |
| బ్యాక్‌పేజీ | - | ₹ 20,000 |
| ఫ్రంట్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |
| బ్యాక్ ఇన్‌సైడ్ | - | ₹ 15,000 |

♦ ప్రకటన రుసుము Loksatta Times పేరిట హైదరాబాద్‌లో చెల్లుబాటు అయ్యే విధంగా చెక్/డిడి రూపంలో పంపగలరు.

బుక్ & కవర్ డిజైన్ : సునీత ఆరిమిల్లి



# 2014 ఎజెండా నుంచే మోదీ 2.0 పాలన మొదలవ్వాలి

## -నరేంద్ర మోదీ, వైఎస్ జగన్‌లకు జేపీ శుభాకాంక్షలు-





**లో**క్‌సభ ఎన్నికల్లో ఘనవిజయంతో తిరిగి అధికారంలోకి వచ్చిన ప్రధాని నరేంద్రమోదీకి, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయంతో ప్రభుత్వం ఏర్పాటు చేయబోతున్న వైకాపా అధ్యక్షుడు వై.ఎస్ జగన్మోహన్ రెడ్డికి లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ శుభాకాంక్షలు తెలిపారు.

జాతీయస్థాయిలో బీజేపీ విజయం మోదీ పాలన తీరుకు, బలమైన నాయకత్వానికి ప్రజలిచ్చిన ఆమోదమని జేపీ అన్నారు. 2019 ఎన్నికల్లో ఒడిషా, పశ్చిమ బెంగాల్, తెలంగాణల్లో బీజేపీ ఏకంగా రెండో స్థానానికి ఎగబాకిందని, ఒక జాతీయ పార్టీ మూడు ప్రధాన రాష్ట్రాల్లో ఇంత వేగంగా పుంజుకోవటం అసాధారణమని అన్నారు. బలమైన కార్యకర్తల వ్యవస్థ, దీర్ఘకాలిక దృష్టితో పార్టీ నిర్మాణం ఇందుకు దోహదం చేశాయన్నారు. 2014లో కంటే కూడా 2019లో బీజేపీకి ప్రజలు ఎక్కువగా మద్దతు పలికారని, ప్రజాతీర్పును అర్థం చేసుకుని వారి ఆకాంక్షల్ని నెర వేర్చాలన్నారు. గత ఎన్నికల్లో హామీ ఇచ్చి అసంపూర్తిగా వదిలేసిన ఎజెండాను మోదీ ప్రభుత్వం తిరిగి చేపట్టాలని, 2014 ఎజెండాతోనే మోదీ 2.0 పాలన మొదలవ్వాలని అన్నారు. జేబులో నుంచి ఖర్చు లేకుండా ప్రతి కుటుంబంలోని వారికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం అందేలా చేయటం, పెద్దఎత్తున ఉపాధి కల్పనకు కార్మిక, భూసేకరణ చట్టాల్ని సవరించటం, రైతులకు ఆదాయం పెరిగేలా వ్యవసాయ రంగాన్ని ప్రక్షాళన చేయటం, చట్టబద్ధపాలనను అమలు చేయటం, సహకార సమాఖ్య వ్యవస్థను బలోపేతం చేయటాల్ని ప్రాధాన్యాంశాలుగా చేపట్టాలన్నారు.

**ఏపీకిచ్చిన విభజన హామీల అమలుపై లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ చొరవతో రూపొందిన 'స్వతంత్ర నిపుణుల నివేదిక'ను జగన్ ప్రభుత్వం ఉపయోగించుకోవాలి**

ఆంధ్రప్రదేశ్‌లో అధికారం చేపట్టబోతున్న వైఎస్ జగన్ అభివృద్ధి నమూనాకు, అంతకుముందున్న తెదేపా అభివృద్ధి నమూనాకు పెద్ద తేడాలేదని, అందువల్ల లోతుగా ఆలోచించి పాత ప్రభుత్వ వైఫల్యాలు పునరావృతం కాకుండా చూసుకోవాలని జేపీ సూచించారు. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నందున ఉత్పాదకతను, యువతకు ఉపాధిని పెంచేలా పథకాలను అమలు చేయాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వం ఓడిపోవటానికి మితిమీరిన అధికార కేంద్రీకరణ, స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేయటం, జన్మభూమి కమిటీలు ప్రధాన కారణాలుగా ఉన్నాయని, ఆ తప్పిదాన్ని కొత్త ప్రభుత్వం చేయకుండా స్థానిక ప్రభుత్వాలను బలోపేతం చేయాలన్నారు. విద్య, ఆరోగ్యంలో ప్రమాణాల్ని పెంచి అందరికీ అందుబాటులోకి తేవటం, ప్రభుత్వ కార్యాలయాల్లో నాణ్యమైన సేవలు అందేలా చర్యలు, రైతులకు మెరుగైన ఆదాయం, అధికారాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లటం మీద జగన్ దృష్టి పెట్టాలన్నారు. వెనకబడ్డ ప్రాంతాలయిన రాయలసీమ, ఉత్తరాంధ్రలకి ప్రాంతీయ మండళ్ళని ఏర్పాటు చేసి, వాటికి పూర్తి అధికారాల్ని ఇవ్వాలని సూచించారు. విభజన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన నిధుల్ని, ఇతర కేటాయింపుల్ని వేగంగా సాధించుకునేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రత్యేక హోదా సహా కేంద్రం ఇచ్చిన హామీలు ఏ దశలో ఉన్నాయి, వాటిని ఏ రీతిలో సాధించుకోవచ్చు.. తదితర అంశాలన్నీ అధ్యయనం చేసి లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ చొరవతో 'స్వతంత్ర నిపుణుల బృందం' రూపొందించిన చేసిన నివేదికను విభజన హామీల సాధనకు కొత్త ప్రభుత్వం ఉపయోగించుకోవాలని జయప్రకాష్ నారాయణ్ కోరారు. ◆

www.twitter.com/jp_loksatta,
www.facebook.com/jploksatta





# వారి డిఫాల్టిజమే వీరి హీరోయిజం

అన్నీ సవ్యంగా సాగినంత కాలం ఇల్లు, సంస్థ, చివరికి ఊరు కూడా అద్భుతం అనిపించేలా ఉంటాయి. ఎప్పుడో ఏదో పెద్ద సమస్యో, సంక్షోభమో వచ్చినప్పుడు పరీక్షా సమయం మొదలవుతుంది. అలాంటప్పుడు.. కాడిపారేయకుండా, ధైర్యాన్ని కోల్పోకుండా, పక్కదోవ పట్టించకుండా సమస్యను సునిశితంగా పరిశీలించి, కష్టాన్ని బాధ్యతగా స్వీకరిస్తూ పరిష్కారంలో భాగమయ్యే వాళ్లు ఉంటే– ఆ సంక్షోభాన్ని అధిగమిస్తాయి, లేకుంటే ఒడిదుడుకులకు లోనై ఒక్కోసారి ఉనికిని కూడా కోల్పోతాయి. అలా పూర్తిస్థాయి బాధ్యతను ధైర్యంతో, తెలివితో, పెద్దరికంతో తీసుకునేవారున్నారు కాబట్టే.. తాజా పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ పెద్ద విజయాన్ని సాధించింది.

బీజేపీ తరపున ప్రధానిగా ఉన్న నరేంద్ర మోదీ, ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు అమిత్‌షా ఈ ఘనవిజయంలో తెర మీద కీలకపాత్ర పోషించారు.

2014లో తాను ఇచ్చిన ప్రధాన హామీలను నెరవేర్చకుండా తొందరపాటుతనంతో నిర్ణయాలు తీసుకుంటూ 2019 ఎన్నికలనాటికి బీజేపీని స్వయంగా తానే సంక్షోభంలోకి నెట్టినా.. నోట్ల రద్దు సమయంలోలా మోదీ వెంటనే తేరుకుని సరిదిద్దుకోగలిగారు. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కూటమిని మళ్లీ విజయపథంలోకి తీసుకెళ్లగలిగారు. ఇదే తరహా పరిస్థితిని రాహుల్‌గాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ ఇంకా తీవ్రంగా ఎదుర్కొంటున్నా కూడా, సంక్షోభాన్ని ఓ పెద్ద అవకాశంగా మలచుకునే నైపుణ్యం, నిబద్ధత, ధైర్యం, ముందుచూపు గల నాయకత్వం ఆ పార్టీలోనూ, దాని మిత్రపక్షాల్లో కూడా కొరవడింది. ఫలితంగా మళ్లీ దారుణ ఓటమి!

(డబ్బు, మద్యం, ప్రలోభాలు, తాత్కాలిక తాయిలాలు, ఫిరాయింపులు, కులం, మతం, ప్రాంతం, భాష మొదలైన ఆటవిక భావోద్రేకాలతో రెచ్చగొట్టి ప్రజలను చీల్చటం.. వంటి రాజ్యాంగ, చట్టవిరుద్ధమైన పనులు చేసైనా సరే ఎన్నికల్లో అధికారం సంపాదించటం అనే 'పరిమితి గల' ప్రధాన పార్టీల పరిధిలో మాత్రమే మనం ఇక్కడ మాట్లాడు కుంటున్నామని గమనించాలి).

### చేసింది చెప్పి మోదీ ఓట్లు అడగలేకపోతున్నా కూడా అందిపుచ్చుకోలేకపోయిన కాంగ్రెస్

2014లో తాను ఇచ్చిన పెద్ద హామీలలో చాలావరకు మోదీ నెరవేర్చలేకపోయారు. ముఖ్యంగా జనాభాలో గణనీయశాతం ఉన్న యువతకు ఉద్యోగావకాశాల్ని ఇవ్వలేకపోయారు, రైతులకు కనీస ధరకు భరోసా కల్పించలేకపోయారు, నల్లధనాన్ని అరికట్టలేకపోయారు. అందుకే తాను చేసింది చెబుతూ ఓట్లు అడగకుండా.. పాక్‌పై ప్రతీకార దాడులు, అతిజాతీయవాదంపై ప్రచారం చేస్తూ పక్కదోవ పట్టిస్తూ ప్రతికూల పరిస్థితుల్ని వేగంగా అధిగమించే ప్రయత్నం చేశారు. తన అద్భుతమైన పొలిటికల్ నెరేషన్‌తో ఆయన వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లిస్తుంటే.. మోదీ చేసిన తప్పుల్ని, ఆయన అసమర్థతల్ని సమర్థవంతంగా, ప్రజలను ఆకట్టుకునేలా కాంగ్రెస్ ఎన్నికల బరిలోకి తీసుకెళ్లలేక పోయింది. బీజేపీ పట్ల ప్రజల్లో ఉన్న వ్యతిరేకతను ఇంకొంత పెంచితే డిఫాల్ట్ అన్నట్లు తనకే మళ్లీ అధికారం వస్తుందని ఆశించింది. ప్రియాంక గాంధీని రంగంలోకి దింపినా, బీజేపీ కంటే మెరుగైన మేనిఫెస్టోని రూపొందించినా కేవలం మోదీని గద్దె దించటం, జనాలకు ఉచితాలను పంచటం వంటి పాత పద్ధతులకే ప్రాధాన్యతనిచ్చింది. అందుకే పూర్తిస్థాయిలో పనిచేస్తూ అధికారం కోసం బీజేపీతో ఢీకొట్టకుండా హాఫ్ హార్టెడ్‌గా మూస ప్రచారాన్ని, వ్యూహాలను అమలు చేసింది. హిందూత్వ కావచ్చు, పుల్వామా దాడులు కావచ్చు..

బీజేపీకి రియాక్షన్‌లా కాంగ్రెస్ వ్యవహరించింది తప్ప బీజేపీకి ప్రత్యామ్నాయాన్ని ప్రజల ముందు ఉంచలేకపోయింది. మోదీ కంటే మెరుగైన జీవన భద్రతను కల్పిస్తామన్న భరోసానివ్వలేకపోయింది.

ఇది కేవలం ఈ ఎన్నికల సమయంలో మాత్రమే జరిగిన తప్పిదం కాదు.. మోదీ తొలి వైఫల్యాల నుంచి కాంగ్రెస్ ఇలాగే అలసత్వంతో వ్యవహరిస్తూ వచ్చింది. తాము ప్రవేశపెట్టిన పథకాలనే అటూఇటుగా కొనసాగిస్తూ, ఆధార్‌నే ఉపయోగిస్తూ వాటిని తన విజయాలుగా మోదీ చాటుకుంటున్నా, స్వచ్ఛ భారత్ వంటి ప్రతిష్ఠాత్మక పథకాలు విఫలమైనా కాంగ్రెస్ స్పష్టతనిస్తూ ప్రజలకు వాస్తవాల్ని వివరించలేకపోయింది.

2016లో నోట్ల రద్దు పేరుతో నల్లధనం, అవినీతి మీద యుద్ధం చేస్తున్నట్లు మోదీ ప్రకటించారు. అందులో వాస్తవం లేదని, నోట్ల రద్దుతో అవినీతి పోదని, నల్లధనం, అవినీతి అంతానికి ఈ నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని లోక్‌సత్తా మొత్తుకున్నా అప్పట్లో కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలు పట్టించుకోలేదు. నోట్ల రద్దుపై తప్పుడు దిశలో దాడుల్ని ఎక్కుపెట్టి మూస పద్ధతిలో పార్లమెంటును స్తంభింపచేశాయి తప్ప.. దీని ద్వారా అవినీతి ఎలా పోతుందో చెప్పాలని మోదీని నిలదీయలేకపోయాయి. గతిలేక ఓ సర్టిఫికెట్ కోసం యాభయ్యో, వందో లంచం ఇచ్చే ప్రజలకు కనీసం మూడేళ్లు, గరిష్ఠంగా ఏడేళ్లు కఠిన జైలుశిక్ష.. లంచం తీసుకున్న అధికారులను మాత్రం అరెస్టు చేయాలన్నా ముందస్తు ప్రభుత్వ అనుమతి – అనే దారుణ నిబంధనతో మోదీ ప్రభుత్వం అవినీతి నిరోధక చట్టానికి సవరణలు చేసినా ఆ తప్పిదాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టటంలో కూడా ప్రతిపక్షాలు విఫలమయ్యాయి. ఈ సవరణలు ఆమోదం పొందటానికి అన్ని పార్టీలూ నిస్సిగ్గుగా మోదీ ప్రభుత్వానికి మద్దతిచ్చాయి. అవినీతిపై ఈ రకమైన దొంగ, అవకాశవాద పోరాటాల్ని ప్రతిపక్షాలు చేయటం వల్లే మోదీ అవినీతిపై పోరాడే యోధుడయ్యారు. దేశాన్ని దోచేసి తెగ బలిసిన సంపన్నుల ప్రతినిధులు మోదీ దెబ్బకు అరుస్తున్నారని ప్రజలు సంబరపడ్డారు తప్ప మోదీ చర్యల వల్ల తమకేదో పెద్ద నష్టం వాటిల్లిందని భావించలేదు. నోట్ల రద్దు, జీఎస్‌టీలను అవగాహనారాహిత్యంతో, అసమర్థంగా అమలు చేసి మోదీ సొంత రాజకీయ ప్రయోజనం పొందినా ప్రజలు ఆయన్ని పెద్ద దోషిగా పరిగణించకుండా వదిలేశారు. స్వతంత్ర సంస్థలను, మీడియాను కూడా మోదీ ఉక్కుపిడికిలితో బిగించటంతో వాస్తవాలు మరుగున పడిపోతూ దాని మీద ఆయన హీరోయిజం విస్తరిస్తూ పోయింది.

### గెలిచిన రాష్ట్రాల్లో కూడా సమీక్ష, సన్నద్ధత లేదు

గుజరాత్, రాజస్థాన్ వంటి చోట్ల రాష్ట్ర ప్రభుత్వాల మీద తీవ్ర వ్యతిరేకత ఉన్నా అక్కడి అసెంబ్లీ ఎన్నికల్లో తామెందుకు బీజేపీ మీద భారీ ఆధిక్యత సాధించలేకపోయామో కాంగ్రెస్ నిశితంగా సమీక్షించుకోలేకపోయింది. కాంగ్రెస్ కొన్ని నెలల క్రితమే గెలిచిన మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ వంటి చోట్ల కూడా బీజేపీ తాజాగా స్వీప్ చేసిందంటే ఆ పార్టీ సన్నద్ధత ఎంత పేలవంగా ఉందో అర్థమవుతుంది. లోక్‌సభ ఎన్నికల్లో తాను బీజేపీ వర్సెస్ అని కాకుండా.. నరేంద్రమోదీ వర్సెస్ అనే రీతిలో పోరాటం చేయాల్సి ఉంటుందన్న కనీస ఆలోచనను కూడా కాంగ్రెస్ చేయలేదని, అంతర్గత బలహీనతల్ని సరిచేసుకోలేకపోయిందని తెలుతుంది.

బీజేపీ ఘనవిజయానికి కోట్లాది బీద కుటుంబాలకి సమర్థంగా అందించిన సంక్షేమ పథకాల అమలు ఒక కీలక కారణం. 2004లో వాజ్‌పేయి ప్రభుత్వం కేవలం మధ్యతరగతి కోసమేనని, తాము బీదలకోసం ఉన్నామని కాంగ్రెస్ ప్రచారం చేయటంతో ఎన్‌డిఏ అనూహ్యంగా ఓటమిపాలయి, యుపిఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగింది. కాని ఈసారి నరేంద్రమోదీ కాంగ్రెస్‌కి ఆ అవకాశం లేకుండా తొలినుంచి బీదవర్గాలని ఆకట్టుకున్నారు.

బీజేపీని ఏకాకిని చేసి అన్ని పార్టీలూ దాడి చేస్తున్నాయని సానుభూతి కోసం మోదీ ఆక్రోశించారుగానీ, బీజేపీతో కలిసి దాదాపు 40 పార్టీలున్నాయి. రకరకాల సమీకరణాలు వేసి వీటన్నిటినీ కలిపి సక్సెస్ ఫార్ములాగా అతికారు. ఈ సమీకరణాలకు తోడు, ప్రతిపక్షాల దివాలాకోరుతనం వల్ల.. ఎన్ని వైఫల్యాలున్నా జాతీయస్థాయిలో మోదీయే మిగిలినవారి మీద బెటర్ నాయకుడు అని ప్రజలు భావించటం వల్ల పలుచోట్ల ప్రాంతీయ పార్టీలు కూడా ఆయన్ని నిలువరించలేకపోయాయి.

రఫేల్ యుద్ధ విమానాలపై కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ చేసిన పోరాటంలో కూడా రాజకీయ నిబద్ధత కంటే వ్యక్తిగత భావావేశాలే ఎక్కువగా కనిపించాయి. బలమైన సాక్ష్యాధారాలను సమీకరించుకోకుండా రఫేల్‌పై శృతి మించి పోరాటం చేశారు. మోదీని ఇరికించటం కన్నా కూడా.. బోఫోర్స్ విషయంలో తన తండ్రి రాజీవ్‌గాంధీకి జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలన్న ఆవేశమే రాహుల్‌లో ఎక్కువగా కనిపించింది. లక్ష్యానికి తగ్గట్టు తన వ్యక్తిత్వాన్ని మలచుకోకుండా, తను తనలాగే స్పందిస్తానంటే ప్రజాజీవితంలో నష్టం తీవ్రంగా ఉంటుంది. అదే రుజువైందిక్కడ.

### మోదీ బీజేపీది కొత్త పంథా అని గుర్తించలేకపోయాయి

మోదీ నాయకత్వంలో బీజేపీ (ఎన్డీయే) ప్రభుత్వం చేస్తున్నది సాంప్రదాయ రాజకీయమే అయినా కొత్త పంథాలో, కొత్త సమీకరణాలు, మేనేజ్‌మెంట్ సూత్రాలతో, రాజీలేకుండా, పకడ్బందీగా చేస్తోందన్న విషయాన్ని కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలు గుర్తించలేకపోయాయి. అందుకే ఐదేళ్లుగా మోదీ తప్పు మీద తప్పు చేస్తున్నా, కొన్ని చోట్ల భయంకరమైన తప్పిదాల్ని చేసినా నిర్దిష్టంగా ఇరుకున పెట్టటంలో, ప్రజల్లోకి తీసుకెళ్లటంలో విఫలమయ్యాయి.

### పొత్తుల్లోనూ కపట విన్యాసాలు

పొత్తుల విషయంలో కూడా నిబద్ధత లేకుండా, త్యాగాలకు సిద్ధపడకుండా, స్వార్థపూరిత అవకాశవాదంతో వ్యవహరించాయి. కాంగ్రెస్ పార్టీ కొన్ని రాష్ట్రాల్లో పొత్తుల విషయంలో వ్యవహరించిన

తీరును చూస్తుంటే (ఢిల్లీ, హర్యానా వంటి చోట్ల పొత్తు, కేరళలో పోటీ వంటివి) తమ రెండు జాతీయ పార్టీలు తప్ప దేశంలో ప్రాంతీయ పార్టీలు, మరే ఇతర జాతీయ పార్టీలు ఉండకూడదన్న రహస్య ఒప్పందం బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య ఉన్నదా అన్న సందేహం కలుగక మానదు. అలాగే యూపీలో ములాయం, అఖిలేష్‌ల పార్టీ ఎస్పీ, మాయావతి పార్టీ బీఎస్పీ తమ పొత్తులో కాంగ్రెస్ లేకుండా జాగ్రత్త పడటం చూస్తుంటే, నోట్ల రద్దు సమయంలో నల్లధనాన్ని తెలుపుగా మార్చుకోవటం, ఇతర కొన్ని కేసులకు సంబంధించి సెటిల్‌మెంట్లు చేసుకోవటానికి వీలుగా మోదీ పార్టీతో లాలూచీ ఒప్పందం ఉన్నదా అని అనుమానం కూడా రాకమానదు. ఇవన్నీ కలగలిసి మోదీకి వ్యతిరేకంగా ప్రజల్లోని సహేతుక అసంతృప్తి బలమైన నిర్ణయంగా మారకుండా చేశాయి. చివరికి 2019 ఎన్నికల్లో అందివచ్చిన ఓ చక్కటి అవకాశాన్ని విపక్షాలు జారవిడిచేలా చేశాయి. మహా అయితే సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన మోదీకి.. అద్భుత విజయాన్ని కట్టబెట్టాయి.

## మోదీకీ హెచ్చరికలున్నాయి

ప్రతిపక్షాల వైఫల్యానికి ఎన్ని కారణాలున్నా, అంతిమంగా మోదీ సాధించిన విజయాన్ని తక్కువగా చూడలేం. కచ్చితంగా ప్రతి పౌరుడూ అభినందించాల్సిన పెద్ద విజయమది. కానీ ఈ ఎన్నికలు మోదీకి కూడా కొన్ని హెచ్చరికల్ని ఇచ్చాయి. ప్రతిపక్షాల చేతగానితనం వల్ల, ఇమేజినేషన్ కొరత వల్ల తనకు ఇంత పెద్ద విజయం లభించిందిగానీ, ఒకానొక దశలో సంకీర్ణానికి కూడా తాను సిద్ధపడ్డానని ఆయన మర్చిపోకూడదు. తన వైఫల్యాల్ని నిశితంగా పరిశీలించి నిజాయతీగా దిద్దుకో గలగాలి. ఏదైతే చేస్తానని వాగ్దానం చేసి 2014లో ఉదారవాద నేతల మద్దతును సైతం మోదీ సమీకరించగలిగారో, ఆ వాగ్దానాల్ని నెరవేర్చటంలో చాలామేరకు విఫలమయ్యానని గుర్తించాలి. మోదీ మితిమీరిన పార్టీ ప్రయోజనాల ధోరణికి.. అవగాహనారాహిత్యం, వ్యక్తిగత అభద్రతాభావంతో కూడిన నియంతృత్వం జతపడటంతో 2014 ప్రజా తీర్పు వృథా అయింది.

దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి మరీ తాను బీజేపీని మళ్లీ గెలిపించినా, ఆ గెలుపు నిలబడాలంటే ఈసారి తన పాలన కీలకమని మోదీ గుర్తించాలి. దేశవ్యాప్తంగా బీజేపీ విస్తరించాక.. తాను చెబుతున్న ఒకే సంస్కృతి, మతం, కేంద్రీకృత పాలన వంటి భావజాలం ఆ గెలుపును కాపాడగలవని, కులవివక్షకు మూలమైన హిందూవాదంతో కుల రాజకీయాలపై ఎల్లకాలం గెలవగలమని, భయభక్తులతో కూడిన భారతదేశాన్ని నిర్మించిన చారిత్రక పురుషుడిగా తాను నిలిచిపోతానని మోదీ అనుకుంటే అది భ్రమే అవుతుంది. నిజంగా బీజేపీ మేలునే తాను కోరుకున్నా కూడా.. మోదీ దాన్ని సుపరిపాలన, మంచి రాజకీయం ద్వారానే సాధించటం తప్ప అడ్డదారులు లేవు. రాజ్యాంగ ప్రజాస్వామ్యాన్ని సమగ్రంగా ప్రతిష్ఠించటం తప్ప ఆయన అఖండ కీర్తిప్రతిష్ఠలకు మరో గ్యారంటీ లేదు. అధికారంలో, అందునా తిరుగులేని అధికారంలో ఉన్నారు కాబట్టి.. మాటల్లో, ఫొటో ఫోజుల్లో కాకుండా చేతల్లో రాజ్యాంగాన్ని, రాజ్యాంగ విలువల్ని ఆయన ఆచరణలో చూపాలి. ఈ వాస్తవాన్ని గుర్తిస్తే.. 2019 నుంచి కాకుండా 2014 నుంచి మోదీ తన 2.0 పాలన ప్రారంభించాలి.

మంచి పాలకుడు, ఎప్పటికీ తన పార్టీని గెలిపించగల పార్టీ నేత అనిపించుకోవాలంటే, 2014లో తాను హామీ ఇచ్చి వదిలేసిన అంశాల అమలు నుంచే మోదీ మొదలవ్వాలి. పార్టీ గెలుపు కోసం, వ్యక్తిగత ఆభిజాత్యాల కోసం పనిచేసే బేరసారాల (ట్రాన్సాక్షనల్) నాయకుడిగా కాకుండా.. దేశంలో మౌలిక మార్పుల కోసం పనిచేసే పరివర్తనా (ట్రాన్స్‌ఫర్మేషనల్) నాయకుడిగా ఆయన మారాలి. పరివర్తన కోసం బేరసారాలాడొచ్చు, కానీ బేరసారాల కోసం పరివర్తనను బలిపెట్టకూడదు. 2014లో ఇచ్చిన హామీల్ని నెరవేర్చబట్టే ప్రజలు తనను గెలిపించారని, 2019 తీర్పు దానికి కొనసాగింపేనని భావిస్తే మాత్రం ప్రత్యర్థులకు దీర్ఘకాలంలోనైనా చక్కటి అవకాశాన్ని పళ్లెంలో పెట్టి ఇచ్చినవారవుతారు, ఇప్పుడు చంద్రబాబు పరిస్థితే రేపు మోదీకి ఎదురవుతుంది.

## పేరులో ఉన్న గాంధీ నుంచి స్ఫూర్తి తీసుకుని ప్రత్యామ్నాయ విధానాలు, పార్టీ నిర్మాణంతో ముందు కొస్తేనే కాంగ్రెస్‌కు భవిష్యత్తు

2024కు కసరత్తుగా 2019 ఎన్నికలు ఉపయోగపడతాయని రాహుల్ గాంధీ భావించినట్టు కనిపిస్తుంది. కానీ ప్రత్యర్థిగా మోదీలాంటి వాళ్లు ఉన్నప్పుడు, ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్ సిస్టం ఎన్నికల విధానమైనప్పుడు అరకొర ప్రయత్నాలు చేస్తే ఏకంగా బొక్కు బద్దలైపోయే ప్రమాదం ఉంటుంది. ఇప్పుడదే జరిగింది. తాను వ్యక్తిగతంగా కష్టపడినా, కొంత మెరుగైన మేనిఫెస్టోని అందించినా కూడా ప్రజలు కాంగ్రెస్‌ను ఘోరంగా ఓడించారని రాహుల్‌జీ షాక్ తినాల్సి వచ్చింది. పేరులో ఉన్న గాంధీ నుంచి స్ఫూర్తిని తీసుకునైనా ప్రజలను ప్రేమిస్తే, ఆయనకు పరిష్కారం గోచరిస్తుంది. తమలాగా మతిలేని తాయిలాల్ని అదేపనిగా ఇవ్వకపోయినా ప్రజలు ఎందుకు మోదీ వైపుకు మొగ్గు చూపారో, తనకంటే వయసులో ఎంతో పెద్దయిన మోదీ వైపునకు యువత ఎందుకు ఆకర్షితులయ్యారో రాహుల్ ఆలోచించుకోవాలి. ఉచితాలు, తాయిలాల మధ్య కూడా ప్రజల ఆకాంక్షలు పెరిగాయని, తమ నాయకుడు నిజాయతీగా ఉండాలని, దృఢంగా వ్యవహరించాలని వారు కోరుకుంటున్నారని ఆయన అర్థం చేసుకోవాలి. మోదీని గద్దె దించటం, బీజేపీ పట్ల ప్రజల్లో వ్యతిరేకతనే ఆలంబనగా చేసుకోవటం, పేదలకు ఉచితంగా పంచటం వంటి పాతకాలపు పద్ధతుల్ని విడనాడి.. మోదీ పార్టీకి ప్రత్యామ్నాయ విధానం, రాజకీయం, ప్రజాస్వామికంగా పార్టీ నిర్మాణంతో ముందుకొచ్చి గట్టిగా నిలబడగలిగితేనే కాంగ్రెస్‌కు మరో ఐదేళ్ల తర్వాతైనా అవకాశం. గతంలో కంటే కాంగ్రెస్‌కు ఈసారి ఓటమి పెద్ద దెబ్బ. త్వరగా దిద్దుబాటు చేసుకోకుంటే అంతరించిపోవటమే. ఈ పాఠాల్ని నేర్చుకుంటే వంశపారంపర్య, కుటుంబ రాజకీయాలకు ఆలవాలమైన పలు ప్రాంతీయ పార్టీలకు కూడా అంతరించిపోయే ప్రమాదం తలెత్తుతుంది. ◆

# తెదేపా తప్పుల్ని జగన్ కొనసాగించరని ఆశిద్దాం



ఇక తెలుగు రాష్ట్రాల విషయానికొస్తే, తెలంగాణలో జరిగిన లోక్‌సభ ఎన్నికల ఫలితాల పట్ల తొలుత ఎవరికీ ఉత్కంఠ లేదు. ప్రతిపక్షాలను నయానాభయానా లోబరుచుకున్నారు కాబట్టి.. ఎంఐఎంకి వదిలిన సీటును మినహాయించి మిగిలిన 16 సీట్లలోనూ యాంత్రికంగానే కేసీఆర్ పార్టీ విజయం సాధిస్తుందనుకున్నారు. కానీ కేసీఆర్ ఏకపక్ష ధోరణి, కేటీఆర్ రాజ్యాంగేతర జోక్యాలు నానాటికీ మితిమీరుతుండటం, ఫిరాయింపులతో ప్రతిపక్షాల్ని నామరూపాల్లేకుండా చేస్తుండటం పట్ల ప్రజల్లో రేగిన అసంతృప్తి ఫలితాల్లో ప్రతిఫలించింది. అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతిపక్షాల వైఫల్యం వల్ల తెరాసకు తృటిలో తప్పిన ఓటమి.. తన తప్పిదాల్ని ఇంకా దిద్దుకోకపోవటం వల్ల పార్లమెంటు ఎన్నికల నుంచి ప్రభావం చూపనారంభించింది.

ప్రజల అసంతృప్తి, విపక్షాల వ్యూహాలతో కరీంనగర్‌లో వినోద్, నిజామాబాద్‌లో కల్వకుంట్ల కవితతోపాటు మరో ఐదుగురు తెరాస ఎంపీ అభ్యర్థులు ఓడిపోవటం, బీజేపీ, కాంగ్రెస్ పుంజుకోవటం తెరాసను దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ ఫలితాలతో, జాతీయస్థాయిలో కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ప్రయత్నాలకూ్కడా విఘాతం కలిగింది. సారు తన పద్ధతుల్ని ఏమైనా మార్చుకుంటారా.. దేశ ఫెడరలిజాన్ని బలోపేతం చేయటమనే తక్షణావసరం కోసం ఆయన కొత్త రోడ్‌మ్యాప్ ఎలా ఉంటుందీ అనేవి వేచిచూడాలి.

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల గురించి కొంత ఎక్కువగా చెప్పుకోవాలి. మోదీని ఎండగట్టటంలో జాతీయస్థాయిలో పార్టీలు విఫలమయ్యాయని తెదేపా అధ్యక్షుడు చంద్రబాబు ఎన్నికల ప్రచార సమయంలో కరెక్టయిన వ్యాఖ్య చేశారు. అలాగే మోదీ, షాల రాజకీయ కదలికల్ని చంద్రబాబు పసిగట్టినట్లుగా ఎవరూ పసిగట్టలేకపోతున్నారు అని కొంతకాలం క్రితం బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఒకరు చేసిన వ్యాఖ్య కూడా కరెక్టే! అయితే.. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం గతకాలపు పాలకులకు భిన్నంగా పాలన, రాజకీయం చేస్తోందని పూర్తిస్థాయిలో గుర్తించటంలో చంద్రబాబు కూడా విఫలమయ్యారు.

వయసు వల్లో, 40 ఇయర్స్ ఇండస్ట్రీ అన్న ధీమా వల్లో రాష్ట్రంలో క్షేత్రస్థాయి వాస్తవాల ప్రభావాన్ని కూడా చంద్రబాబు తక్కువగా అంచనా వేశారు. వైఎస్ జగన్ పార్టీ దెబ్బకి ఓడిపోవాల్సిన స్థితిలో ఉన్న తనకు నూతన ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఏమి ఆశించి 2014లో పట్టంగట్టారో ఆయన స్పష్టంగా అర్థం చేసుకోకుండా ప్రత్యేకహోదాని, పోలవరాన్ని మూడేళ్లపాటు నిర్లక్ష్యం చేశారు. అభివృద్ధి కేంద్రీకరణ పద్ధతిలో అమరావతి నిర్మాణాన్ని ఒక ప్రహసనంగా మార్చారు. స్థానిక ప్రభుత్వాలను నిర్వీర్యం చేసేలా ఏర్పాటు చేసిన జన్మభూమి కమిటీలతో గ్రామీణ ప్రజలకు చుక్కలు చూపించారు. పాలనను ఈవెంట్ మేనేజ్‌మెంట్లలా మార్చేశారు. వీటిపై లోక్‌సత్తా పలుమార్లు హెచ్చరించినా వినిపించుకోలేదు. ప్రత్యేక హోదా, ఫిరాయింపులు వంటి విషయాల్లో రోజుకోరకంగా మాట మార్చటం చంద్రబాబు విశ్వసనీయతను దెబ్బతీసింది. మీడియా మీద తనకు పట్టు ఉంది కాబట్టి.. తను ఎలా మాటమార్చినా చెల్లుబాటవుతుందని భ్రమించారు. అవినీతి ఆరోపణలు వచ్చినప్పుడు వాస్తవికంగా స్పందించకుండా.. అవినీతే లేదు, నేను నిప్పుని అంటూ హాస్యాస్పదంగా మాట్లాడారు. పాలనలోనూ, క్షేత్రస్థాయిలోనూ ప్రజాప్రతినిధులు, అధికారుల విశృంఖల అవినీతిని చూస్తున్న ప్రజలు.. ముఖ్యమంత్రి అబద్ధాలు, అవకాశవాద మాటలకు జుత్తు పీక్కున్నారు. చంద్రబాబు నాయుడు లాంటి సీనియర్ నాయకుడి నుంచి ప్రజలు, ముఖ్యంగా యువత విశ్వసనీయతను, సానుకూల అభివృద్ధిని ఆశిస్తారు. ఆ రెంటి విషయంలో వైఫల్యాలు చంద్రబాబును బాగా దెబ్బతీశాయి. తన పాతకాలపు ప్రచారపంథాను భరించలేక జనం చెవులు మూసుకుంటున్నా గుర్తించలేదు.

దానికితోడు, తన కుమారుడు లోకేష్‌ను నాయకుడిగా ఆమోదింపచేయటానికి.. అర్హతలతో సంబంధం లేకుండా ఆయనకు మంత్రి పదవి ఇవ్వటం, సీనియర్ నేతల వారసులను అప్రజాస్వామికంగా ప్రోత్సహించటం, ఎమ్మెల్యేల భారీ అవినీతిని సహించటం పార్టీలో పోటీతత్వాన్ని కుంగదీశాయి, స్తబ్దుగా మార్చాయి. లోకేష్‌కి టెక్నాలజీ మీద పట్టుంది గదాని దాన్నే సర్వరోగనివారిణిగా ఉపయోగించారు. ఏమాటకామాట చెప్పుకోవాలి.. చంద్రబాబుకు ప్రాంతీయ, కుటుంబ అభిమానాలు తక్కువ. అందువల్లే రాయలసీమ మీద మితిమీరిన ప్రేమను చూపలేదు, పలువురు కుటుంబ సభ్యులను కూడా దగ్గరకు రానివ్వలేదు. ప్రజాజీవితంలో ప్రాంతీయ, కుటుంబ అభిమానాలను పక్కనపెట్టటం మంచిదే (చంద్రబాబు కేంద్రీకృత పాలన వల్ల రాయలసీమ బాగుపడలేదుగానీ, ఆయన వ్యక్తిగత ప్రేమను చూపకపోవటం వల్ల కాదు). కానీ డబ్బు, అధికారం, ఆడంబరాల పట్ల మితిమీరిన ఆకర్షణ, పార్టీని సొంత ఆస్తిగా భావించటం చంద్రబాబును

## మండుటెండల్లోనూ అత్యధిక పోలింగ్

2019 సార్వత్రిక ఎన్నికల్లో స్వతంత్ర భారత దేశ చరిత్రలోనే అత్యధికంగా 67.11 శాతం పోలింగ్ నమోదైంది. అది కూడా మండుటెండల్లో. 2004 నుంచి గత మూడు సార్వత్రిక ఎన్నికలలో పెరుగుతూ వస్తున్న పోలింగ్ శాతం ఈసారి 17వ లోక్‌సభ ఎన్నికల్లో కూడా పెరిగింది. 2014 నాటికంటే ఓట్ల శాతాన్ని ఈ ఎన్నికల్లో 37.5 శాతానికి పెంచుకుని ఘనవిజయాన్ని బీజేపీ నమోదు చేసింది. సింగిల్‌గానే 300 సీట్ల మార్కును దాటింది. నరేంద్రమోదీ నేతృత్వంలోని ఎన్డీయేకు 43.8 శాతం ఓట్లు, 352 లోక్‌సభ స్థానాలు రాగా, కాంగ్రెస్ సారథ్యంలోని యూపీయేకు దాదాపు 25 శాతం ఓట్లు, 96 స్థానాలు మాత్రమే లభించాయి. మిగిలిన రాజకీయ పక్షాలు 30.3 శాతం ఓట్లతో 94 పైగా స్థానాల్ని పొందాయి. ఎంపీల్లో 88 శాతం కోటీశ్వరులుకాగా, 43 శాతం మంది నేరచరితులు.

తెలంగాణలో అధికార తెరాస 9 లోక్‌సభ స్థానాలకే పరిమితం కాగా, అనూహ్యంగా బీజేపీ 4 స్థానాలను సాధించింది. మూడు స్థానాలతో కాంగ్రెస్ పుంజుకుంది. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ పార్టీ దాదాపు 50 శాతం ఓట్లతో భారీ విజయాన్ని సాధించింది. అసెంబ్లీలో వైకాపాకు 151 సీట్లు రాగా, 39.18 శాతం ఓట్లు పొందిన తెదేపాకు 23, జనసేనకు 1 లభించాయి. లోక్‌సభ స్థానాల్లో వైకాపాకు 22, తెదేపాకు 3 దక్కాయి. ఈ ఎన్నికల్లో ఏ అభ్యర్థీ, పార్టీ నచ్చలేదంటూ 'నోటా'కు పెద్దఎత్తున ఓట్లు పడ్డాయి. బీహార్‌లో దాదాపు 8 లక్షల ఓట్లు నోటాకు పడగా, ఏపీలో 4 లక్షల ఓట్లు (1.3 శాతం) పడ్డాయి. ఆంధ్రప్రదేశ్‌లో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలలో విజేతకు లభించిన ఆధిక్యం కన్నా నోటాకు ఎక్కువ ఓట్లు పడ్డాయి. కొన్ని చోట్ల జనసేనకు పడ్డ ఓట్ల కన్నా నోటాకు ఎక్కువ వచ్చాయి. ఏపీలో బీజేపీ, కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం, బీఎస్పీలకు వచ్చిన ఓట్లు కన్నా నోటాకు పడ్డ ఓట్లు ఎక్కువ.

ఈ ఎన్నికల్లో దేశవ్యాప్తంగా పార్లమెంటుకు 78 మంది మహిళలు (14 శాతం) ఎన్నికయ్యారు. ఒడిషాలో బిజూ జనతాదళ్ పార్టీ ఎంపీల్లో 42 శాతం మంది మహిళలే. పార్టీపరంగా ఇదో కొత్త రికార్డు. 33 శాతం టికెట్లను మహిళలకు బిజూ జనతాదళ్, తృణమూల్ పార్టీలు ఈ ఎన్నికల్లో కేటాయించిన సంగతి తెలిసిందే. పలు పార్టీల్లో పురుష అభ్యర్థుల కంటే మహిళా అభ్యర్థుల విజయాల శాతమే ఎక్కువగా ఉండటం కూడా గమనార్హం.

తన సామాజిక వర్గానికి చెందిన రాజకీయ వ్యాపారుల పెదధోరణులకు తలొగ్గేలా, లోకేష్ లోపాల పట్ల కళ్లు మూసుకునేలా చేసింది. తనతో సమవయస్కుడయిన మోదీకి కనెక్టయినట్లు యువత తనకు ఎందుకు కనెక్ట్ కావటంలేదో అన్న ఆలోచన కూడా బాబు చేయలేక పోయారు.

తెలంగాణలో డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో తన జోక్యం సెంటిమెంట్‌ను రగిలించి కేసీఆర్‌కు మేలు చేసినట్లు, జగన్–కేసీఆర్ దోస్తీ తనకు ప్రయోజనం చేకూరుస్తుందని చంద్రబాబు ఆశించారు. దీనికి ప్రజలు కొంతమేర స్పందించినప్పటికీ, తెలంగాణలోలాగా మితిమీరి స్పందించకపోవటం, దీన్నే పట్టుకుని చంద్రబాబు రోజుల తరబడి ప్రచారం చేయటం బెడిసి కొట్టింది. కేసీఆర్ వ్యూహాత్మక మౌనం వహించినా బాబు ఆగలేదు. ఇప్పుడున్న పరిస్థితుల్లో రాష్ట్రంలో ఎలాంటి రాజకీయ స్టేక్స్ లేని మోదీని అదేపనిగా విమర్శించటం కూడా ప్రజలకు విసుగు పుట్టించింది. మరోవైపు, కేసీఆర్‌లాగా తీవ్ర అవినీతిలో, గూండాగిరిలో కూరుకు పోయిన పలువురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకే మళ్లీ టికెట్లు ఇచ్చి గెలిపించుకోగలనని భావించటం చంద్రబాబును బాగా ముంచింది. తెదేపాకు తొలి నుంచి ప్రత్యర్థిగా ఉన్న కాంగ్రెస్‌తో పొత్తు, ఆ పొత్తుతో తెలంగాణలో ఓడిపోవటంపై బాబు లోతైన అధ్యయనం చేసినట్లు కనిపించదు.



కేంద్రంలో మోదీని, రాష్ట్రంలో ప్రత్యర్థిని ఎదుర్కొని నిలదొక్కుకోవాలంటే.. చంద్రబాబు పార్టీ పాలనా, రాజకీయ సంస్కరణలకు కొంత స్పేస్ ఇస్తూ నూతన ప్రచార ధోరణుల్ని అవలంబించాలి (ఈ కొత్తదనం లేకే తెలంగాణలో సమూలంగా తుడిచిపెట్టుకుపోయింది). తెలుగుదేశాన్ని సంస్కరణల పార్టీగా పునర్నిర్మించుకోవాలి. ఈ పని చేయకుండా, సంస్కరణ శక్తుల పట్ల అభద్రతాభావంతో రాజకీయ తప్పిదాల్ని చేయటంతోపాటు తాత్కాలిక తాయిలాల మీద ఆధారపడ్డారు. సంస్కరణలకు దోహదం చేసేలా పొత్తులతో, కొత్త అభ్యర్థులతో ఎన్నికలకు వెళ్లకుండా జనం విసిగిపోయిన పార్టీ, ప్రభుత్వంతో యథాతథంగా తాజాగా బరిలోకి దిగారు. అదికూడా బహుశా తెలుగుదేశం చరిత్రలో ఎన్నడూ లేని రీతిలో ఒంటరిగా.

కొత్త రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ ఆర్థికవ్యవస్థను, పాలనను స్థూలస్థాయిలో గాడిలో పెట్టగలిగినా, తొలి మూడేళ్లు చేసిన పలు తప్పిదాలు చంద్రబాబును ఎన్నికల సమయం నాటికి వెన్నాడాయి. నేరచరిత్ర ఉండి, ప్రజలు సంశయదృష్టితో చూసే వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని.. కొత్త రాష్ట్రంలో భిన్నమైన పాలన ద్వారా తేలిగ్గా అధిగమించే అవకాశాన్ని జారవిడుచుకోవటం వల్ల ఎన్నికల్లో ఆయన ఎంతకైనా దిగజారాల్సి వచ్చింది. చంద్రబాబు ప్రభుత్వ ఖజానా సొమ్మును పథకాల రూపంలో పంచి ఓట్ల కొనుగోలుకు ప్రయత్నిస్తే, వైఎస్ జగన్ పార్టీ ప్రైవేటు డబ్బుల్ని తెదేపా కంటే భారీగా పంచినట్లు పలు వర్గాల సమాచారం.

## తెదేపాకు, వైకాపాకు తేడా లేనప్పుడు..

## జగన్‌కు ఒకసారి అవకాశం ఇచ్చి చూస్తే తప్పేంటి అనుకున్నారు

చంద్రబాబు పాలన పట్ల విసుగు, తిరస్కార భావన పెరగటం, ఆయనతో పోలిస్తే జగన్ కొంత మాటకు కట్టుబడి ఉండటం, కాపు రిజర్వేషన్లు, పవన్ కళ్యాణ్‌తో పొత్తు వంటి విషయాల్లో నిర్మొహమాటంగా వ్యవహరించటం, చంద్రబాబు ఇచ్చిన తాయిలాలన్నీ జగన్ కూడా ఇస్తాననటం, సుదీర్ఘ పాదయాత్ర చేయటం, వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ చొరవతో బూత్ స్థాయిలో వైకాపా పటిష్టంగా వ్యవహరించటం అన్నీ జగన్ విజయానికి బాటలు పరిచాయి. తెదేపాకు, వైకాపాకు తేడా ఏమీ లేని స్థాయికి తన పాలనను చంద్రబాబు దిగజార్చుకోవటంతో జగన్‌కు ఒకసారి అవకాశం ఇచ్చి చూద్దామన్న భావన ప్రజల్లో పెద్దఎత్తున ఏర్పడి ఆయన ఘనవిజయాన్ని ఖరారు చేశాయి. ఎన్నో అవినీతి ఆరోపణలున్న జగన్‌పై విచారణ చేసి కేసుల్ని తేల్చలేని న్యాయవ్యవస్థను నడిపే పాలకులకు ఓటు వేయటం కంటే, అవినీతికి పాల్పడినా వ్యక్తయినా సరే జగన్‌కే ఓటు వేద్దాం అని మెజారిటీ సాధారణ ప్రజలు అనుకుంటే వారిని మరీ అంత తప్పుపట్టగలమా? పైగా చంద్రబాబు సహా తెదేపాలో ఎంతమంది అవినీతిపరులు లేరు అని ఓటర్లు ప్రశ్నిస్తే సమాధానమేది?

గెలుపోటములను అలా ఉంచితే, ఇప్పుడు రాష్ట్రం ముందున్న సమస్యేమిటంటే.. వైకాపా, తెదేపాల అభివృద్ధి, రాజకీయం నమూనాల్లో పెద్దగా తేడాలు లేకపోవటం. 'చంద్రబాబు ఎన్నికలకు ముందు చివరి మూడు నెలల్లో చేసిన పాలన నిజమనుకోబాకండి. ఆ తర్వాత మిమ్మల్ని పీల్చిపిప్పిచేస్తాడు' అని వైఎస్ జగన్ ఎన్నికల ప్రచారంలో అనటం ద్వారా.. తాత్కాలిక తాయిలాలే గొప్ప పాలనకు గీటురాయి అన్న దివాళాకోరు రాజకీయాన్ని ఆయన పార్టీ కూడా ఆమోదించినట్లయింది. ప్రతి యాభై ఇళ్లకు ఒక వలంటీర్‌ను ఏర్పాటు చేసి ప్రభుత్వ పథకాలు అందేలా చేస్తామని కూడా ఆయన చెప్పారు. ఇవి మరో జన్మభూమి కమిటీల్లా మారకుండా ఉంటాయా అన్నది అనుమానాస్పదమే.

తన మీదున్న కేసుల దృష్ట్యా కేంద్రంలోనివారు బ్లాక్‌మెయిల్ చేయకుండా జాగ్రత్తపడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజల ప్రయోజనాల్ని వైఎస్ జగన్ ఎలా పరిరక్షిస్తారో, ప్రత్యేకహోదా వంటివి ఇలా సాధిస్తారో వేచి చూడాలి. ప్రత్యేక హోదా అంటే ఎన్ని నిధులు, ఎటువంటి రాయితీలు వస్తాయి, బీజేపీకి మెజారిటీ వస్తే ప్రత్యేక హోదా ఎలా సాధిస్తారు, కేసీఆర్ మద్దతిస్తే ఆయన దృష్టిలో ప్రత్యేక హోదా అంటే ఏమిటి.. వంటి అంశాలపై చర్చించాలని లోక్‌సత్తా ఎన్నికలకు ముందే విజ్ఞప్తి చేసింది. వైకాపా సహా ప్రత్యేకహోదా తమకు ప్రాధాన్యాంశమని చెప్పుకుంటున్న వారంతా ఎన్నికల ప్రచారంలో ఈ అంశాలపై చర్చ చేయకపోవటం ఆశ్చర్యం. రానున్నకాలంలో తెలుగుదేశం ఎమ్మెల్యేలందరినీ వైకాపాలోకి పంపేసో, మరోరకంగా లాగేసో, లేదా పార్టీని విభజించో, చంద్రబాబును జైలుకు పంపో తెదేపా ఖాళీ అయితే ఆ శూన్యంలోకి బీజేపీ ప్రవేశించాలని చూస్తున్నట్లు అంచనా (తెదేపా గెలిచి ఉంటే వైకాపా విషయంలో ఇదే వ్యూహాన్ని బీజేపీ అమలు చేసి ఉండేది). ఇది అంత తేలిక కాకపోవచ్చుగానీ.. బీజేపీ రాజకీయ వ్యూహాలు ఎలా ఉన్నా, అవి రాష్ట్ర ప్రయోజనాలకు, ప్రజాస్వామ్యానికి నష్టదాయకం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత జగన్ మీద ఉంది. ఇతరులను సొరకొట్టే అలవాటు జగన్‌కు తక్కువ అనే భావనను పలువురు వ్యక్తం చేస్తుంటారు. వీటన్నిటినీ సరిచేసుకుంటూ ప్రజాప్రయోజనాలకు ఉపయోగపడేవారిని కలుపుకుని ఆయన పనిచేయటం ప్రారంభించాలి. గతంలోలా అసెంబ్లీని చిన్నచూపు చూడటం, ఇతరుల సహకారాన్ని పరిగణలోకి తీసుకోకపోవటం వంటివి మార్చుకోవాలి. తెలుగుదేశం ప్రభుత్వంలోని మంచిని కాకుండా చెడును యథాతథంగా కొనసాగిస్తే మాత్రం, ఏపీ ప్రజల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టవుతుంది.

మార్పు నినాదంతో వచ్చిన జనసేన వ్యవస్థాపకుడు పవన్ కళ్యాణ్ అందుకోసం సరైన విధానాలను, శక్తులను కలుపుకోకపోవటంతో పెద్దగా ప్రభావం చూపలేకపోయారు. ఆయన పాతికేళ్లు పోరాడతానంటున్నారు కాబట్టి, లక్ష్యాన్ని, మార్గాన్ని ఇప్పటికైనా సరైనరీతిలో నిర్ణయించుకోవాలి, నిలకడగా వ్యవహరించాలి.

## డేటా పేరుతో జనాన్ని విభజించే ప్రయత్నం చేశారు

ఈ ఎన్నికల్లో నల్లడబ్బు ప్రవాహంతోపాటు మీడియా సహా వ్యవస్థల దుర్వినియోగం, పలు అంశాల్లో ఎన్నికల సంఘం వైఫల్యం స్పష్టంగా కనిపిస్తుంది. డేటా విశ్లేషణ పేరుతో ప్రజల్ని జల్లెడ పట్టి కులం, మతం, ప్రాంతం, భాష, గ్రామీణం, పట్టణం వారీగా విభజించి, వారికి ఎరలు వేసే ప్రయత్నాలు పెద్దఎత్తున జరిగాయి. విమర్శలు పరిధి దాటాయి. చర్చా ప్రమాణాలు దిగజారాయి.

సరైన లక్ష్యంలేని అధికారం కోసం జరిగిన ఈ ఎన్నికల వైఫల్యాలను తెలుగు రాష్ట్రాల్లో, జాతీయ స్థాయిలో 2024 నాటికన్నా సరిదిద్దుకునేలా అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యం, స్థానిక ప్రభుత్వాల సాధికారత, ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాల్లో నాణ్యమైన సేవలు, వ్యవసాయం లాభసాటి, పర్యావరణ పరిరక్షణ, ఎన్నికల సంస్కరణల కోసం కృషి చేయకపోతే పార్టీలు మరింతగా ప్రతిష్ఠను కోల్పోయి ప్రజాస్వామ్యంలో సంక్షోభం మరింత పెరుగుతుంది.

**కొసమెరుపు:** 2014 ఎన్నికలకు ముందు ఒక మహిళా ఓటరు ఈ రచయితతో మాట్లాడుతూ, ఎలాగైనా చంద్రబాబే గెలిచి నూతన ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రి కావాలని అన్నారు. ఎందుకు? అని అడిగితే.. చంద్రబాబు ఎంతో కష్టపడి పాదయాత్ర చేస్తున్నారని, ఆయన కష్టానికి ప్రతిఫలంగా గెలిపించాలని అన్నారు. పాదయాత్రలను, శారీరక కష్టాలను గౌరవించొచ్చుకానీ వాటిని చూసి ఓటు వేయకూడదని, రాష్ట్రానికి మేలు చేసే అంశాలు ఏ పార్టీకి, ఏ నాయకునికి ఉన్నాయో వారికే ఓటు వేయాలని అన్నాను. లోక్‌సత్తా బరిలో ఉన్నా కూడా తెదేపాకే ఆమె ఓటు వేశారు. ఇటీవల 2019 ఎన్నికల ముందు మళ్లీ ఆమెకు ఈ విషయాన్ని గుర్తుచేస్తూ, గతంలో చంద్రబాబులా ఈసారి జగన్ బాబు పాదయాత్ర చేశారు గదా, పాపం ఆయన కష్టానికి ప్రతిఫలంగా వైకాపాకు ఓటు వేస్తారా? అని అడిగాను. తెదేపా అభిమాని అయిన ఆమె అవాక్కయ్యారు. ◆

# రూ. 30 కోట్లు .. 60 కోట్లు.. 10,000 కోట్లు.. ఈ పంచుడు ఎందాకా..?

- ఆర్కే



తెలుగునాట జరిగిన ఎన్నికలలో చోటుచేసుకున్న సిత్రాల గురించి ఇప్పుడు ముచ్చటించుకుందాం. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఈ ఎన్నికలలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో డబ్బు సంచులు స్వైరవిహారం చేశాయి. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో కనిష్ఠంగా 30 కోట్లు, గరిష్ఠంగా 60 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. ఈ ఎన్నికలలో నాకు 55 కోట్లు ఖర్చయిందని అసెంబ్లీకి పోటీ చేసిన ఒక అభ్యర్థి ఇటీవల నన్ను కలిసి చెప్పుకొచ్చారు. "అంత డబ్బు ఖర్చు చేసి ఎమ్మెల్యేగా గెలిచి ఏమి సాధిస్తారు?" అని నేను ప్రశ్నించగా– "నాకూ తెలియడం లేదు" అని ఆయన బదులిచ్చారు. ఆస్తులు అమ్మి, అప్పులు చేసి అభ్యర్థులందరూ పోటాపోటీగా ఖర్చు చేశారు. తెలంగాణలో జరిగిన ఎన్నికలలో అధికార తెలంగాణ రాష్ట్ర సమితి ఒక్కో అభ్యర్థికి కనిష్ఠంగా పది కోట్ల రూపాయలు అందజేసింది. ఇది కాకుండా, అభ్యర్థులతో సంబంధం లేకుండా, వారికి తెలియకుండా ఓటర్లకు, డ్వాక్రా మహిళలకు డబ్బులు పంచారు. ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికలలో ప్రత్యేకత ఏమిటంటే, అధికార తెలుగుదేశం పార్టీ కంటే ప్రతిపక్ష వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎక్కువగా డబ్బు ఖర్చు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబుకు నిధులు అందకుండా అటు కేంద్ర ప్రభుత్వం, ఇటు తెలంగాణ ప్రభుత్వం శక్తివంచన లేకుండా ప్రయత్నాలు చేశాయి. దీంతో 'అధికారంలో ఉండి కూడా' తెలుగుదేశం పార్టీ డబ్బులు కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి! 2014లో జరిగిన ఎన్నికలలో వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి తన పార్టీ అభ్యర్థులకు డబ్బులు ఇవ్వలేదు. గెలుపుపై మితిమీరిన విశ్వాసంతో అభ్యర్థుల నుంచి ఆయన ఎదురు డబ్బు తీసుకున్నారు. ఇప్పుడు తత్వం బోధపడింది. దీనికితోడు అటు ఢిల్లీ నుంచి, ఇటు హైదరాబాద్ నుంచి కూడా భారీగా ఆర్థిక సహాయం అందడంతో ఈ ఎన్నికల్లో జగన్మోహన్‌రెడ్డి ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థికి కనీసం పది కోట్లు, గరిష్ఠంగా ఇరవై కోట్ల రూపాయల వంతున నిధులను ముందుగానే అందజేశారు. తాము తెలుగుదేశం పార్టీ కంటే ఎక్కువగా ఓటర్లకు డబ్బు పంచామనీ, ఆ కారణంగానే తమకు గెలుపుపై నమ్మకం ఏర్పడిందని వైసీపీకి చెందిన ఒక అభ్యర్థి చెప్పుకొచ్చారు. ఎన్నికలలో తలపడే రెండు ప్రధాన పార్టీలకు చెరో 30 శాతం ఓట్లు ఖాయంగా ఉంటాయి. గెలుపునకు అవసరమైన మిగతా ఓట్ల కోసమే ఓటర్లకు డబ్బు పంచుతూ ఉండేవారు. ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. మొత్తం ఓటర్లందరికీ డబ్బు పంచాల్సిన పరిస్థితిని కొనితెచ్చుకున్నారు. "నా నియోజకవర్గంలో రెండు లక్షల మంది ఓటర్లున్నారు. ఒక్కొక్కరికి రెండు వేల వంతున రెండు లక్షల మందికి కలిపి 40 కోట్ల రూపాయలు పంచాను" అని ఒక అభ్యర్థి వాపోయారు. ప్రభుత్వ ఉద్యోగులు, వ్యాపారులు, సంపన్నులు కూడా సంకోచం లేకుండా డబ్బులు తీసుకుంటున్నారు! పార్టీల అభిమానులు కూడా డబ్బు అడుగుతున్నారట! ఒకప్పుడు గ్రామాల్లో పెద్ద రైతులు చేయి చాపడానికి నామోషీగా భావించేవారు. ఇప్పుడు వంద ఎకరాలున్న రైతు కూడా పార్టీలు పంచే డబ్బు కోసం చేయి చాపుతున్నారు. ఇదంతా ఒక ఎత్తు అయితే.. ఎన్నికల సందర్భంగా, ముఖ్యంగా పోలింగ్ రోజున సహకరించడానికై ప్రధాన రాజకీయ పార్టీల అభ్యర్థులు పోలీసులకు లంచం ఇస్తున్నారు. పోలింగ్ అధికారులను కూడా తమ వైపునకు తిప్పుకోవడానికి డబ్బులు ఇస్తున్నారు. "నేను నా నియోజకవర్గంలో కేవలం పోలీసులకే 50 లక్షల రూపాయలు ఇవ్వాల్సి వచ్చింది" అని ఒక అభ్యర్థి బావురుమన్నాడు. పోలింగ్ సిబ్బందికి డబ్బు ఎందుకు ఇస్తున్నారని ఒకరిని ప్రశ్నించగా, ఓటు వేయడం తెలియనివారు సిబ్బంది సహకారం తీసుకుంటారనీ, అలాంటప్పుడు వారు ఓటర్ల అభిప్రాయంతో నిమిత్తం లేకుండా తమకు కావాల్సినవారికి అనుకూలంగా ఓటు వేస్తారనీ చెప్పుకొచ్చారు. అంతేనా.. ఎన్నికల ప్రచారం సందర్భంగా పోలీసులు పట్టుకునే డబ్బుకు సరైన లెక్కలు ఉండవు. తెలంగాణలో ప్రత్యర్థి పార్టీకి చెందినవారి డబ్బు పట్టుకుంటే దానిని మీరే తీసుకోండి అని పోలీసులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారని ప్రచారంలో ఉంది. బహుశా ఈ కారణంగానే కాబోలు అధికార పార్టీ వారికి చెందిన డబ్బు ఎక్కడా పట్టుబడలేదు. అప్పట్లో కాంగ్రెస్.. తెలుగుదేశం పార్టీలకు చెందినవారి డబ్బు పోలీసులకు పట్టుబడింది. తమకు సహకరించినందుకుగాను ఎన్నికల నిర్వహణలో కీలకపాత్ర పోషించిన ఒక ముఖ్య అధికారికి భారీ కానుకను అందజేసినట్టు చెబుతున్నారు. ఎన్నికలలో అనుకూలంగా వ్యవహరించడానికై పోలీసులు, పోలింగ్ సిబ్బందికి లంచాలు ఇస్తున్న పార్టీలలో ఏదో ఒక పార్టీ అధికారంలోకి వస్తూ ఉంటుంది. అధికారంలోకి వచ్చిన తర్వాత అదే పార్టీ ఉద్యోగులలో అవినీతి పెరిగిపోయిందంటూ రంకెలు వేస్తుంటుంది. మొత్తం మీద మన ఎన్నికల ప్రక్రియ సర్వం అవినీతిమయం అయిపోయింది. పాలకులు, పాలితులు కూడా అవినీతికి ఆశ పడుతున్నారు. ఎన్నికలలో 30–40 కోట్లు ఖర్చు చేసినవారు నీతిగా ఉండాలనుకోవడం అత్యాశే అవుతుంది. ఒక అంచనా ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎన్నికలలో ప్రధాన పార్టీలు, అభ్యర్థులు కలిసి దాదాపుగా 10,000 కోట్ల రూపాయలు ఖర్చు చేశారు. వచ్చే ఎన్నికల నాటికి ఇది రెట్టింపు అయినా ఆశ్చర్యపోవాల్సింది ఏమీ లేదు. తిలాపాపం తలా పిడికెడు అన్నట్టు ఎన్నికల సందర్భంగా అందరూ అంతో ఇంతో లాభపడు తున్నారు. ఓడిపోయిన అభ్యర్థులు మాత్రం లబోదిబో అంటూ ఉంటారు. ఇదంతా రాజకీయ పార్టీల స్వయంకృతాపరాధమే! ◆

*(ఆంధ్రజ్యోతి 'కొత్తపలుకు' కాలమ్ నుంచి)*

# పెత్తనం ఎక్కువ, పని తక్కువ.. ఈసీ ఎన్నడూ ఇంతగా అధ్వాన్నంగా లేదు: జేపీ




ఎన్నికల కమిషన్ ప్రచార యావను, రాజభక్తిని, పెత్తనం చెలాయించే ధోరణుల్ని మానుకుని ప్రజాస్వామ్య దేశంలో ఎన్నికల్ని సకాలంలో, సక్రమంగా ఎలా నిర్వహించాలో నేర్చుకోవాలని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ హితవు పలికారు.

ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో ఈసీ వైఫల్యానికి పలు ఆధారాలున్నాయని జేపీ అన్నారు. ఎంతో సులువుగా జరగాల్సిన ఎన్నికలను లక్షలమంది సైన్యం ఉంటే తప్ప జరగవన్నట్లుగా గందరగోళం చేశారన్నారు. ఎన్నికల పేరుతో మూడు నెలల పాటు మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌ను అమలు చేయటం ప్రజాస్వామ్యాన్ని పరిహసించటమేనన్నారు.

ఎమర్జెన్సీ వచ్చి దేశవ్యాప్తంగా పలు చోట్ల ప్రజానీకం అప్పటి అధికార పార్టీకి వ్యతిరేకంగా వెల్లువెత్తినప్పుడు కూడా ఎన్నికల్ని మూడు నాలుగు రోజుల్లో ముగించారని జేపీ అన్నారు. ఆనాడు 1977లో రెండు దశల్లో మార్చి 17, మార్చి 19న ఎన్నికల్ని నిర్వహించి మార్చి 21న ఫలితాల్ని ప్రకటించారన్నారు. కెన్యాలో 27 ఏళ్ల నియంతృత్వం తర్వాత కెన్యాలో ఎన్నికలు జరిగితే తాను కామన్వెల్త్ తరపున పరిశీలకుడిగా వెళ్లానని, అధ్యక్షుడు, పార్లమెంటు, స్థానిక ప్రభుత్వాలకి ఒకే రోజు ఎన్నికల్ని నిర్వహించి, అదే రోజున ఫలితాల్ని ప్రకటించారన్నారు. ఒక్క అవాంఛనీయ సంఘటన కూడా జరగలేదన్నారు. ఇటీవల ఇండొనేషియాలో 19 కోట్లమందికిపైగా ఓటర్లకు ఎన్నికల్ని ఒకే రోజులో నిర్వహించారన్నారు. ఒకటి, రెండు రోజుల్లో ఎన్నికల్ని ఎలా నిర్వహించాలో మనం ఆయా దేశాల నుంచి నేర్చుకోవాలన్నారు. మనదే గొప్ప ప్రజాస్వామిక దేశమన్నట్లు విర్రవీగటం తప్ప ఇతర దేశాల్లో మంచి ప్రయత్నాలను, వారి అనుభవాలను తెలుసుకుని నేర్చుకోవటానికి మనం ప్రయత్నించటం లేదన్నారు. ఎంత చిన్న దేశం నుంచయినా మంచిని నేర్చుకోవటానికి భేషజాలకు పోకూడదని ఎన్నికల సంఘానికి, పార్టీలకు కూడా జేపీ చురకలంటించారు.

ఎటువంటి కారణం లేకుండానే ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్ని సుదీర్ఘ కాలవ్యవధితో నిర్ణయించటంతోపాటు.. పోలింగ్ అయిపోయిన తర్వాత కూడా వారాల తరబడి, నెలానెలన్నర పైబడి ఎన్నికల కోడ్ పేరుతో ఈసీ అధికారులు పాలనను



స్తంభింప చేశారని జేపీ అన్నారు. ఎన్నికల ప్రచార సమయంలో కోడ్ ఆఫ్ కాండక్ట్ ఉల్లంఘించినవారి పట్ల చర్యలు తీసుకోవటంలో కూడా పక్షపాత ధోరణిని ప్రదర్శించారన్నారు. ప్రతిపక్షాల నేతలు, మద్దతుదారుల ఇళ్ల మీదే పన్నుల అధికారుల దాడులు జరిగాయని, తప్పు చేస్తే ప్రతిపక్ష, అధికార పక్ష అనే తేడా లేకుండా చర్యలు తీసుకోవాలన్న నిష్పాక్షికత వాతావరణాన్ని నెలకొల్పేందుకు ఈసీ ప్రయత్నించలేదన్నారు. బెంగాల్ ఎన్నికల్లో ప్రచారాన్ని ముందుగా ముగించటంలోనూ జవాబుదారీతనంతో వ్యవహరించలేదన్నారు.

వీవీ ప్యాట్ల లెక్కింపు విషయంలో కూడా పారదర్శకతను పెంచేలా వ్యవహరించకుండా, రోజుల తరబడి పడుతుందన్న బాధ్యతారహిత సమాధానంతో ఎన్నికల సంఘం ఉదాసీనంగా వ్యవహరించిందని జేపీ అన్నారు. ఈవీఎంలపై ప్రతిపక్షాలది తప్పుడు విమర్శే కావచ్చు కానీ, వాటి మీద సామాన్య ప్రజల్లో అనేక అనుమానాలున్నాయన్నారు. తాము వేసే ఓటు తాము వేయాలనుకున్నవారికే పడిందన్న విశ్వాసం ప్రజల్లో కల్పించాల్సిన బాధ్యత ఈసీదేనన్నారు. ఎన్నికల సమయంలో పక్షపాత రాజకీయాలకు అతీతంగా పనిచేస్తుందన్న విశ్వాసాన్ని కల్పిస్తుందనే ఎన్నికల సంఘానికి అంత అధికారాన్ని కట్టబెట్టారని, ఆ విశ్వాసమే ప్రజాస్వామ్య మనుగడకు కీలకమన్నారు.

మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రభుత్వ అధికారులను వివరణ కూడా అడగకుండా ఈసీ బదిలీలు చేసిందని జేపీ విమర్శించారు. ప్రధాన కార్యదర్శి అనిల్ పునేఠాను అకారణంగా, అవమానకరంగా తొలగించారన్నారు. పునేఠా తన వద్ద శిక్షణ పొందారని, విధి నిర్వహణలో చాలా నిజాయతీగా, బాధ్యతాయుతంగా వ్యవహరించే అధికారి అని తెలిపారు. ఎన్నికలు పూర్తయినా ప్రభుత్వం రోజువారీ పాలన చేయకుండా అవరోధాలు సృష్టించటం.. జవాబుదారీతనం లేకుండా ఇష్టమొచ్చినట్లు బదిలీలు చేయటం ఈసీ తన పరిధిని అతిక్రమించటమేనన్నారు. ఎన్నికల నిర్వహణ వరకే ఈసీ బాధ్యత తప్ప, పరిపాలనను ప్రభావితం చేయటం కాదన్నారు. మునుపెన్నడూ ఈసీ ఇంత అహంకారాన్ని, దిగజారుడు పనితీరును కనబరచలేదన్నారు. సార్వభౌమాధికారం.. ప్రజల నుంచి ఎన్నికైన ముఖ్యమంత్రి, ప్రధానమంత్రి వద్ద ఉంటుంది గానీ, ఎన్నికల సంఘం, ప్రధాన కార్యదర్శి, ప్రధానమంత్రి కార్యాలయ అధికారుల చేతుల్లో ఉండదన్నారు. అటువంటి సార్వభౌమాధికారం ఉన్న వాళ్లు కూడా ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిందేనని, ఈసీ, సుప్రీంకోర్టు సహా ఏ సంస్థ మినహాయింపుల్ని చాటుకోలేదని స్పష్టంచేశారు.

తాజా ఎన్నికల నేపథ్యంలో.. నల్లడబ్బు ప్రభావం, తాత్కాలిక తాయిలాలు, నేరచరితులు వంటి అంశాలతోపాటు ఎన్నికల సంఘం పనితీరుపై కూడా చర్చ జరగాలని, సంస్కరణలు రావాలని జేపీ అన్నారు. రాజకీయాల పట్ల ప్రజల్లో ఉన్న జుగుప్సను అవకాశంగా చూసుకుని ఈసీ అధికారులు ఈసారి చెలరేగిపోయారన్నారు. రేపు ఇదే అధికారులు గెలిచిన పార్టీ నేతల ముందు వంగివంగి సలాములు పెడతారన్నారు. ఏ రకంగా చూసినా ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న ఈ ధోరణులను సహించకూడదన్నారు. ఓటర్ల జాబితాల ప్రక్షాళన, ఓటర్ల నమోదుకు పోస్టాఫీసుల్ని శాశ్వత నోడల్ ఏజెన్సీలుగా చేయటం వంటి కీలకమైన పనులను ఎన్నికల సంఘం ఎవరి కోసమో ఎదురుచూడకుండా చేసేయొచ్చని, అవి చేయకుండా ప్రచారం, అధికార ఆధిపత్యం మీద దృష్టి కేంద్రీకరించటం వంటి ధోరణులకు కళ్లెం వేయాలన్నారు. సమర్థులు, నిజాయతీపరులు చట్టసభకు ఎన్నికవగలిగేలా ఎన్నికల సంస్కరణలు, ఈసీ పనితీరు మెరుగుపడటం ద్వారానే ప్రజాస్వామ్యం నిలదొక్కుకోగలుగుతుందన్నారు. ◆




# సంక్షోభంలో ప్రజాస్వామ్యం..
# 'స్థానిక ప్రభుత్వాల' సాధికారతకై ఉద్యమిద్దాం

సరైన నాయకుల కొరత, విపరీత మైన డబ్బు చుట్టూ జరుగుతున్న ఎన్నికల వల్ల మన ప్రజాస్వామ్యం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం ఉద్యమించటమే దీనికి పరిష్కారమని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. అధికారం పైస్థాయిలో కేంద్రీకృతమవటం వల్ల పంచాయతీలు, మునిసిపాలిటీలు పాలనా జాడ్యాలకు నిలయాలుగా తయారైతే ఉన్నకొద్దీ జనజీవితం దుర్భరంగా మారుతుందన్నారు. స్థానిక ప్రభుత్వాల సాధికారత కోసం రికార్డు స్థాయిలో 1 కోటీ 8 లక్షల సంతకాల సేకరణతో 2003లో లోక్‌సత్తా ఉద్యమం ప్రారంభించిననాటి కంటే కేంద్రీకృత పాలన ఇంకా పెరిగిందని.. దీంతో స్థానిక పరిస్థితులు ఇప్పుడు ఇంకా అధ్వాన్నంగా తయారై ప్రజాస్వామ్యాన్ని అవహాస్యం చేస్తున్నాయన్నారు.

**పంచాయతీల నుంచి మునిసిపల్ కార్పొరేషన్‌ల వరకు ఆంధ్రప్రదేశ్‌లో త్వరలో జరగనున్న స్థానిక ఎన్నికలను ప్రజాస్వామ్య సంక్షోభ పరిష్కారానికి ఒక అవకాశంగా ఉపయోగించుకోవాలని లోక్‌సత్తా పార్టీ నిర్ణయించింది. స్థానిక ప్రభుత్వాల పటిష్టతకు రాజకీయ, ప్రజాభిప్రాయ సమీకరణ కోసం కార్యక్రమాలను ప్రారంభించింది. ఇందులో భాగంగా అన్ని రాజకీయ పార్టీల పెద్దలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజాసంఘాలు, మేధావులతో విశాఖపట్నంలో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని ఏర్పాటు చేసింది. విశాఖ సిటీ ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జేపీ దిశానిర్దేశం చేశారు.**

ఆలోచనలు, వనరులు లేని బలహీన గ్రామాలు ఒకవైపు .. సమాజం కోసం, తమ గ్రామాల కోసం ఏదో చెయ్యాలని తపించే లక్షలాది యువత మరో వైపు ఉన్న దుస్థితి ప్రస్తుతం మన వద్ద నెలకొందని జేపీ అన్నారు. గ్రామంలో ఎన్నికల్లో పోటీ చేసి నెగ్గుదామనుకున్నా పలుచోట్ల రూ. 30 నుంచి 50 లక్షల దాకా ఖర్చు చేస్తేనే సర్పంచ్‌గా కనీసం బరిలో నిలబడే పరిస్థితి ఉందన్నారు. ఎన్నికలు వేలం పాటల్లా తయార య్యాయన్నారు. దీనివల్ల ప్రజలకు సరైన పాలన అందకుండా అవినీతి మేటలు వేస్తోందని, అపారమైన యువశక్తి వృథా అయిపోతోందని అన్నారు. నిస్సహాయ స్థితిలో యువత గ్రామాలను వదిలి పట్టణాలకు, నగరాలకు వలసలు పోతున్నారన్నారు. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికార తెదేపా రూ. 20,000 కోట్లను తాయిలాలుగా పథకాల

### నేరుగా ఎన్నికలు నిర్వహించాలి

స్థానిక ప్రభుత్వాలకు నేరుగా ఎన్నికలు నిర్వహించాలి. ఎన్టీరామారావు ముఖ్యమంత్రిగా ఉండగా స్థానిక ప్రభుత్వాలకు ప్రత్యక్ష ఎన్నికలను నిర్వహించారు. దీనివల్ల పలుచోట్ల చదువుకున్నవారు, సమర్థులు పాలనా పగ్గాలు చేపట్టారు. ఇప్పుడు ఐదంచెల విధానం అమల్లో ఉందిగానీ, స్థానిక ప్రభుత్వాలు నిర్వీర్యమైపోయాయి. కేవలం ఉత్సవ విగ్రహాలుగా మిగిలాయి.

**– భీశెట్టి బాబ్జీ, లోక్‌సత్తా పార్టీ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్**

### సహకారం అందిస్తా...

లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షులు జయప్రకాష్ నారాయణ్ మంచి అంశాన్ని లేవనెత్తారు. ఆయన చేపడుతున్న ఈ ఉద్యమానికి పార్టీపరంగా, వ్యక్తిగతంగా నేను సహకరిస్తాను. మళ్లీ ఎమ్మెల్యేగా ఎన్నికైతే అసెంబ్లీలో దీనిపై పోరాటం చేస్తాను. స్థానిక సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. ప్రత్యక్ష ఎన్నికల నిర్వహణే మేలు.

**– పి.విష్ణుకుమార్‌రాజు, ఎమ్మెల్యే, విశాఖ ఉత్తర నియోజకవర్గం**



రూపంలో ప్రజలకు పంచిందని, వైఎస్ జగన్ పార్టీ ఇచ్చిన హామీల్ని నెరవేర్చాలంటే రూ.50,000 కోట్లు అవసరమని అన్నారు. ఇలా ప్రజలకు తాయిలాల్ని పంచటం, ఉద్యోగులకు జీతాలివ్వటం తప్ప ప్రభుత్వాలు ప్రజల రోజువారీ జీవితాల్ని మెరుగుపరిచేలా గ్రామాలను, పట్టణాలను బాగు చేసే పాలనను ప్రధాన పార్టీలు అందించలేకపోతున్నాయన్నారు. ఇలా పందేరాలు తప్ప పాలన, జనాభాకు తగ్గ అభివృద్ధి లేకపోతే కొన్నాళ్లకు వెనిజులా తరహాలో పొట్ట చేత పట్టుకుని వలసలు పోవటం తప్ప మార్గముండదన్నారు. సరైన వ్యవస్థల నిర్మాణం లేకపోవటం వల్ల మనం ఏం కోల్పోతున్నామో ప్రజలు గుర్తించాలని, స్థానిక సాధికారత కోసం ప్రజల నుంచి ఉద్యమం రావాలని అన్నారు.

- స్థానిక ప్రభుత్వాలకు అన్ని స్థాయిల్లో (సర్పంచ్ నుంచి మునిసిపల్ ఛైర్మన్, మేయర్ దాకా) ప్రత్యక్ష ఎన్నికల నిర్వహణ
- స్థానిక ప్రభుత్వాలకు నిధులు, అధికారాలు, సిబ్బంది కేటాయింపు, ప్రతి పౌరుని పేరు మీదా తలసరి ఇంతని రాష్ట్ర బడ్జెట్ నుంచే నిధులివ్వటం
- పంచాయతీల నిర్వహణను సమర్థవంతం చేయటానికి, గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా బలంగా ఉన్న కుల వివక్ష, పెత్తందారీతనం వంటి రుగ్మతలను కట్టడి చేయటానికీ.. ఒక్కో గ్రామాన్ని ఒక్కో పంచాయతీగా కాకుండా, కొన్ని గ్రామాల సముదాయాన్ని ఒక పంచాయతీగా గుర్తించి కౌంటీ తరహాలో ఎన్నికల్ని నిర్వహించటం

**జాతీయ స్థాయిలో ఉద్యమించాలి**

స్థానిక సంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉంది. వీటికి ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికలు జరిపితే సమర్థులకు అవకాశం లభిస్తుంది. దీనికోసం రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఉద్యమించాలి. జేపీ చేపట్టే ఉద్యమానికి మా పార్టీ తరపున సంపూర్ణ మద్దతిస్తాం.

**– ఎం. పైడిరాజు, సీపీఐ నాయకులు**

**మీ వెంటే మేమూ...**

గతంలో ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యం ఉండేది కాదు. ఇటీవలికాలంలో డబ్బే ఎన్నికలను నడుపుతోంది. 2012 నుంచి విశాఖ కార్పొరేషన్‌కు ఎన్నికలు జరగలేదు. దీంతో పాలన పడకేసింది. స్థానిక సంస్థల కోసం జేపీ ఉద్యమం చేపడితే మీ వెంటే మా పార్టీ ఉంటుంది.

**– నాగేందర్, బీజేపీ నగర అధ్యక్షులు**

.. లక్ష్యాలుగా ఈ ప్రజాఉద్యమం ఉండాలని జేపీ అన్నారు. స్థానిక ప్రభుత్వాలకు సంబంధించిన వ్యవహారాలన్నిటినీ రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి కేంద్రం బదిలీ చేయాలని, రాష్ట్ర ప్రభుత్వం స్థానిక ప్రభుత్వాలకి అధికారాలను, నిధులను బదిలీ చేయాలని అన్నారు. ఐదంచెలు కంటే మూడంచెల స్థానిక ప్రభుత్వాలు మేలన్నారు. ప్రణాళికా బోర్డులను బలోపేతం చేసి వాటి సిఫార్సుల్ని అమలు చేయాలన్నారు. వీటి కోసం ప్రజలు గట్టిగా డిమాండ్ చేయాలన్నారు.

### 30,000 జనాభాకో పంచాయతీ మేలు

తెలుగు రాష్ట్రాల్లో తక్కువ జనాభా ఉన్న ఆవాసాలను కూడా పంచాయతీలుగా మార్చి వాటిని ఇంకా బలహీన పరుస్తున్నారని, దీనివల్ల వనరులు లేక, నిర్వహణ భారమై ప్రజలే ఇక్కట్ల పాలవుతారని జేపీ అన్నారు. కేరళ తరహాలో కొన్ని పంచాయతీలను సముదాయం (క్లస్టర్)గా ఏర్పాటు చేసి 30,000 జనాభాకొకటి చొప్పున ఎన్నికలు నిర్వహించటం మేలన్నారు. కేరళలో పంచాయతీల సంఖ్య 1000 లోపే ఉందన్నారు. ఇలా పంచాయతీల క్లస్టర్‌లకు ఎన్నికలు నిర్వహించి అధికారాల్ని, నిధుల్ని, సిబ్బందిని అందజేసి, నిర్ణయాలను స్థానిక పెద్దలకే వదిలేయాలన్నారు. అక్కడ తప్పు జరిగితేనే రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు.



### రాష్ట్రం నుంచి 10 శాతంతో మొదలుపెట్టి కేటాయింపుల్ని పెంచాలి

కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాలకు బడ్జెట్‌లో సగం, అంటే దాదాపు రూ.13.70 లక్షల కోట్లు వస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్థానిక ప్రభుత్వాలకు ఒక్క శాతం కూడా బదిలీ కావటం లేదన్నారు. ఈ పరిస్థితిని ఇక ఆమోదించ కూడదన్నారు. విధిగా రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సర్కార్లకు నిధుల్ని బడ్జెట్ నుంచే విడుదల చేయాలన్నారు. కనీసం 10 శాతంతో మొదలు పెట్టి ఈ కేటాయింపుల్ని పెంచాలన్నారు.

### దేశ సమైక్యత-స్వయంపాలన-సుపరిపాలన-అవినీతి నిర్మూలన-యువతకు నాయకత్వం చుట్టూ

### ఒక సమగ్ర వ్యూహంతో స్థానిక సాధికారత ఉద్యమాన్ని నిర్మించాలి

ఒక సమగ్రమైన వ్యూహాన్ని రూపొందించడం ద్వారా జాతి ఐక్యత దెబ్బతినకుండా ప్రజాస్వామ్యాన్ని సంక్షోభం నుంచి గట్టెక్కించడానికి ఉద్యమించాల్సిన అవసరముందని జేపీ పిలుపునిచ్చారు. అధికారం జనం చేతికి రావాలంటే దేశ సమైక్యత, జవాబుదారీ తనం, అవినీతి నిర్మూలన అవసరమన్నారు. ఈ బృహత్తర మార్పునకు స్థానిక ప్రభుత్వాల సాధికారత పునాది అవుతుందన్నారు. ఒకప్పుడు నెహ్రూ, చిత్తరంజన్‌దాస్, వల్లభాయ్

### స్థానిక సంస్థలు నిర్వీర్యం

స్థానిక సంస్థలు నామ్‌కేవాస్తేగా నడుస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ఇందిరమ్మ కమిటీలు, తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు జన్మభూమి కమిటీలు స్థానిక సంస్థల అధికారాల్ని హరించుకున్నాయి. ఈ పరిస్థితి పోవాలి. అందుకే జేపీ చేపట్టబోయే ఉద్యమంలో మేము పాల్గొంటాం.

**– మామిడి అప్పలనాయుడు, పంచాయతీ ఛాంబర్ జాతీయ అధ్యక్షులు**

### రహదారులు తప్ప అభివృద్ధి శూన్యం

స్థానిక సంస్థలకు అధికారాలు లేకపోవడం వల్ల గ్రామాల్లో కేవలం రహదారులు తప్ప అభివృద్ధి కనిపించడం లేదు. గతంలో సమితి అధ్యక్షులకు మంచి అధికారాలు ఉండేవి. శాసనసభ్యులు సమితి అధ్యక్షులను అడిగే పనులు చేయించుకొనేవారు. ఇప్పుడా పరిస్థితి పోయింది. స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికల కోసం జాతీయస్థాయిలో చర్చ జరగాలి. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉండగానే స్థానిక సంస్థలకు చట్టసవరణ జరిగింది.

**– కొణతాల రామకృష్ణ, మాజీ మంత్రి**



పటేల్ వంటి నాయకులు స్థానిక ప్రభుత్వాల నుంచే జాతీయస్థాయికి ఎదిగారన్నారు. అప్పట్లో గొప్ప నాయకులు చిట్టచివరి పౌరుని స్థాయి నుంచి సమాజాన్ని పట్టించుకుంటూ గొప్ప స్థాయిని అందుకున్నారని, దేశానికి ఎనలేని సేవ చేశారని అన్నారు. అలాంటి నాయకత్వం ఇప్పుడు కరువవుతోందన్నారు. సంక్షోభానికి మూలం ఎక్కడుందో తెలుసుకుని పరిష్కారం కోసం ప్రయత్నించకుండా, రోడ్ల మీద కొచ్చి యాగీ చేయటం వల్ల ఫలితం ఉండదన్నారు. సమస్యను అవగాహన చేసుకుని, హేతుబద్ధ వాదనలతో, అందరి ప్రయోజనాలనూ సమన్వయం చేస్తూ పోరాడు తుండటం వల్లే తాను ఒక్క ఎంపీ కూడా లేకుండానే 91, 97, 99 తదితర కీలక రాజ్యాంగ సవరణల్ని సాధించగలిగానని, జాతీయ ఆరోగ్య మిషన్, వ్యవసాయంలో సంస్కరణలు, మౌలిక వసతులు వంటివి దేశ ప్రజలకు లోక్‌సత్తా అందుబాటులోకి తేగలిగిందని అన్నారు. యువత ఇలా కొంత ఆలోచనతో, స్థానిక సమస్యల పరిష్కారంలో భాగమయ్యే వ్యవస్థను మనం నిర్మించాలంటే స్థానిక ప్రభుత్వాల సాధికారత మినహా మార్గం లేదన్నారు. మనకంటే నియంతృత్వ చైనాలో స్థానిక ప్రభుత్వాలకు ఎక్కువ అధికారాలున్నా యన్నారు.

**అధికారాలు, నిధులు లేని కోటాలతో ఉపయోగమేంటి?**

ఎస్.సి, ఎస్.టి, బీసీలు, మహిళలకు స్థానిక ప్రభుత్వాల్లో కోటాలు ఇచ్చామని డబ్బా కొట్టుకుంటున్నారని, నిధులు, అధికారాలు లేకుండా అణగారిన వర్గాలకు సాధికారతను ఎలా ఇవ్వగలరని జేపీ ప్రశ్నించారు.

**రోడ్‌మ్యాప్ ఎంతో ఒడుపుగా కూడా ఉండాలి..**

### గడువు ముగియగానే ఎన్నికలు నిర్వహించాలి

లోక్‌సభ, అసెంబ్లీలకు గడువు ముగియగానే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. అదే పద్ధతి స్థానిక సంస్థలకు ఎందుకు పాటించడం లేదు? స్థానిక సంస్థల గడువు ముగిసిన వెంటనే ఎన్నికలు నిర్వహించాలి. సవరించిన పంచాయతీరాజ్ చట్టంలో పేర్కొన్న పంచాయతీలకు 29, పురపాలక సంఘాలకు 16 అంశాల బదలాయింపు దేశంలో ఏ రాష్ట్రం పూర్తిగా అమలు చేయలేదు. మూడంచెల విధానం మళ్లీ తీసుకురావాలి.

**– రోశి రెడ్డి, పంచాయతీ ఛాంబర్ కార్యదర్శి**





### తెలుగు రాష్ట్రాల నుంచే మొదలుపెడదాం.. పార్టీల కతీతంగా కలిసిరండి

యువత నాయకులుగా ఎదిగేందుకు, ప్రజలకు స్వయంపాలన, సుపరిపాలన అందేందుకు, ప్రజాస్వామ్యాన్ని గాడిలో పెట్టేందుకు కీలకమైన స్థానిక ప్రభుత్వాల సాధికారతకు పకడ్బందీ ప్రజాఉద్యమాన్ని తెలుగు రాష్ట్రాల్లో ప్రముఖులతో కలిసి రూపొందిద్దామని, పార్టీలకతీతంగా అందరూ ఈ ఉద్యమంలో కలిసిరావాలని జేపీ విజ్ఞప్తి చేశారు. 73, 74వ రాజ్యాంగ సవరణల్లోని లోపాల్ని సరిచేసి స్థానిక ప్రభుత్వాలకు సాధికారతను రాజ్యాంగ సవరణ ద్వారా ఇచ్చే అవకాశం కోసం 2005లో లోక్‌సత్తా చేసిన ప్రయత్నం అప్పట్లో ఒక కేంద్ర మంత్రి చేసిన తప్పిదం వల్ల తృటిలో తప్పిపోయిందని, అధికార వికేంద్రీకరణకు ఇప్పుడు పరిస్థితి మరీ జటిలంగా ఉంది కాబట్టి.. సమగ్రంగానే కాకుండా చాలా వ్యూహాత్మకంగా, చాకచక్యంగా కూడా తాజా రోడ్‌మ్యాప్ ఉండాలన్నారు. పంచాయతీలు, మునిసిపల్ వార్డులు ఎలా ఉండాలో, ఎన్నికలు ఎలా జరగాలో, అక్కడ ఏం పనులు ఎలా చేయాలో జాతీయ స్థాయిలో రాజ్యాంగంలో చెప్పటం హాస్యాస్పదమన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాజీ మంత్రులు కొణతాల రామకృష్ణ, రెడ్డి సత్యనారాయణ, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, రాష్ట్ర పంచాయతీరాజ్ ఛాంబర్ నేతలు రోశి రెడ్డి, మామిడి అప్పలనాయుడు, బీజేపీ నేత నాగేందర్, సీపీఐ పైడిరాజు, బీఎస్పీ నాయకుడు దాలిరాజు, చలసాని గాంధీ, మాజీ ఎంపీపీ చినరామునాయుడు, వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ, ట్యాక్స్ పేయర్స్ అసోసియేషన్ కన్వీనర్ పి. సత్యనారాయణ, వేణుగోపాల్, వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, జర్నలిస్టు నేత శివశంకర్, కాంగ్రెస్ తదితర పార్టీల, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు, యువత, విద్యార్థులు పాల్గొని ఆలోచనల్ని పంచుకున్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు జేపీ చేపట్టే ఉద్యమంలో తామంతా ఉంటామని వారందరూ హామీ ఇచ్చారు. ◆

# సంక్షోభంలో గ్రామీణ ఆరోగ్యం

**- పీవీ రావు,** ఆర్థిక, సామాజిక విశ్లేషకులు



ఏటా లక్షమంది భారతీయులకు 122 మంది సరైన చికిత్స లభించక మరణిస్తున్నారని ఓ అధ్యయనంలో తేలింది. ఈ విషయంలో పొరుగు దేశాలు పాకిస్థాన్ (119), బంగ్లాదేశ్ (57), నేపాల్ (93), శ్రీలంక (51) కన్నా మనం తీసికట్టుగా ఉన్నాం. అరకొర చికిత్స వల్ల చైనాలో మృత్యువాత పడుతున్నవారి సంఖ్య లక్షకు 46 మాత్రమే. భారత్‌లోని గ్రామప్రాంతాల్లో వైద్య సేవలు మహా అధ్వాన్నంగా ఉండటం వల్ల మరణాలు ఎక్కువగా నమోదవుతున్నాయి. నేడు గ్రామాల్లో 80 శాతం రోగులకు సరైన అర్హతలు లేని ఆర్ఎంపీ వైద్యులు చికిత్స చేస్తున్నారు. వీరిలో చాలామంది కనీసం హైస్కూలు చదువైనా పూర్తి చేసి ఉండరు. గ్రామీణ భారతంలో ప్రతి అయిదుగురు వైద్యుల్లో ఒక్కరికి మాత్రమే చికిత్స చేసే అర్హత ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఓ) తేల్చింది. దీన్నిబట్టి గ్రామాలకు నాటువైద్యులే దిక్కని అర్థమవుతోంది. గ్రామీణ భారతంలో అలోపతి వైద్యులమని చెప్పుకొంటున్న వారిలో 31.4 శాతం ఇంటర్ వరకు మాత్రమే చదివారని, 57.3 శాతానికి ఎలాంటి వైద్యార్హతలు లేవని 2016లో డబ్ల్యుహెచ్ఓ నివేదిక వెల్లడించింది. ప్రజారోగ్యంపై వ్యయాన్ని జీడీపీలో ఒక శాతం నుంచి మూడు శాతానికి పెంచే ఉద్దేశంతో 2005లో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకాన్ని ప్రారంభించినా, పకడ్బందీ విధానం లేకపోవడం పెద్ద లోపం. ప్రభుత్వాస్పత్రుల కోసం కోట్ల రూపాయలు వెచ్చించి అధునాతన వైద్య పరికరాలు కొన్నా, వాటిని ఉపయోగించకుండా మూలన పడేస్తున్నారు. చాలా సందర్భాల్లో సిబ్బంది వాటిని చెడగొట్టి రోగులు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి కల్పిస్తున్నారు. మొత్తం మీద వైద్య పరికరాలకు 27.21 శాతం కొరత ఉందని, ఆక్సిజన్ సిలిండర్ల వంటి వైద్యేతర పరికరాలయితే 56.33 శాతం కొరత ఉందని 'కాగ్' నివేదిక తెలిపింది. తనిఖీలు, మరమ్మతులు చేయకపోవడం వల్ల కీలక వైద్యపరికరాలు అయిదేళ్ల నుంచి మూలన పడిన సందర్భాలు అనేకం.

## అంచెలంచెల చికిత్సా కేంద్రాలు

దేశంలోని 6.38 లక్షల గ్రామాల్లో 74 కోట్ల మంది నివసిస్తున్నారు. వీరి కోసం ప్రభుత్వం ఉపచికిత్సా కేంద్రాలు, ప్రాథమిక చికిత్సా కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలను నెలకొల్పింది. ఏదైనా ఆరోగ్య సమస్య వస్తే ప్రజలు మొదట ఉప చికిత్సా కేంద్రానికి వెళ్తారు. అక్కడ ఒక పురుష, ఒక మహిళా ఆరోగ్య కార్యకర్త ఉంటారు. మాతాశిశు సంరక్షణ, పౌష్టికాహారం అందించడం, టీకాలు వేయడం, నీళ్ల విరేచనాలు, ఇతర అంటువ్యాధుల నిరోధం వీరి బాధ్యత. ప్రతి 5,000 జనాభాకు ఒక ఉప చికిత్సా కేంద్రం, ప్రతి 30 వేల మందికి ఒక ప్రాథమిక చికిత్సా కేంద్రం (పీహెచ్‌సీ), ప్రతి 1.20 లక్షల జనాభాకు ఒక సామాజిక చికిత్సా కేంద్రం (సీహెచ్‌సీ) నెలకొల్పారు. ప్రతి పీహెచ్‌సీ ఆరు ఉప చికిత్సా కేంద్రాలకు, ప్రతి సీహెచ్‌సీ నాలుగు పీహెచ్‌సీలకు 'రిఫరల్ యూనిట్'గా పనిచేస్తాయి. ఒక్కో పీహెచ్‌సీలో నాలుగు నుంచి ఆరు పడకలు ఉండి చికిత్స, రోగ నిరోధక, కుటుంబ సంక్షేమ విధులను నిర్వహిస్తుంది. ఒక్కో సీహెచ్‌సీలో సాధారణ వైద్యుడు, శస్త్ర చికిత్స డాక్టరు, పిల్లల, స్త్రీ వ్యాధి నిపుణులు ఉండాలి. ప్రతి సీహెచ్‌సీలో 30 పడకలు, ఒక శస్త్ర చికిత్స గది, ఎక్స్ రే, కాన్పు గదులు, ప్రయోగశాల ఉండి అత్యవసర సేవలు, నిపుణుల సేవలు అందించాలి. ఆచరణకు వచ్చే సరికి అన్నీ లసుగులే. ఔట్ పేషెంట్ సేవలు అవసరమైనవారిలో 20 శాతానికి, ఆస్పత్రి లోపల చికిత్స అవసరమైనవారిలో 45 శాతానికి మాత్రమే వైద్య సేవలు అందుతున్నాయి. ఆరోగ్య కేంద్రాల్లో చికిత్సా పరికరాలు, మందులు, మౌలిక వసతులు లేకపోవడం, సిబ్బంది చీటికిమాటికి విధులకు హాజరుకాకపోవడం ఈ దుస్థితికి కారణాలు. దేశవ్యాప్తంగా ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది గైర్హాజరీ 40 శాతానికి చేరింది. ఈ పరిస్థితిని చక్కదిద్దే అధికారం స్థానిక సంస్థల అధికారులకు లేదు. ఆరోగ్య కేంద్రాల సిబ్బందికి ప్రభుత్వం నుంచి నేరుగా జీతాలు అందుతాయి. అయినా వైద్యులు పీహెచ్‌సీలకు బుద్ధిపుట్టినప్పుడు మాత్రమే వచ్చిపోతూ బయట సొంత ప్రాక్టీస్ పెట్టుకుంటున్నారు. పీహెచ్‌సీల్లోని మహిళా సిబ్బంది మంత్రసానులుగా వ్యవహరించాల్సి ఉన్నా అవసరం వచ్చినప్పుడు పత్తా లేకుండా పోతున్నారు. పీహెచ్‌సీల్లో ఉచిత సేవలు అందించాల్సి ఉన్నా సిబ్బంది రోగుల నుంచి డబ్బు పిండుతున్నారు. అందుకే జనం ప్రైవేటు వైద్యుల వద్దకు వెళ్లడం ఎక్కువైంది. వైద్యసేవలకు ప్రభుత్వమిచ్చే సబ్సిడీలు పేదలకన్నా ధనికులకే హెచ్చు లబ్ధి చేకూరుస్తున్నాయి. జనాభాలో అట్టడుగు 20 శాతం పేదలకు ప్రజారోగ్య సబ్సిడీలో కేవలం 10 శాతం అందుతుంటే, జనాభాలో 20 శాతంగా ఉన్న ధనిక, ఎగువ మధ్యతరగతికి 30 శాతం సబ్సిడీ లభిస్తోందని 2001లో ఒక అధ్యయనం తెలిపింది. పేదలను ఉద్ధరించాలన్న ప్రభుత్వ లక్ష్యానికి పట్టిన దుర్గతి ఇది!

## సంస్కరణలకు సమయం

ప్రజలందరికీ ఆరోగ్య సేవలు అందించడం ప్రభుత్వానికి అలవికాని పని అని మొదట అంగీకరించాలి. ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలా, ప్రభుత్వ ఆస్పత్రి సేవలు పొందాలా అన్నది నిర్ణయించుకునే స్వేచ్ఛ పేదలకే ఉండాలి. పేదలకు 'ఔట్ పేషెంట్' సేవలకు నేరుగా నగదు బదిలీ చేయడం, 'ఇన్‌పేషెంట్' సేవలకు బీమా సౌకర్యం కల్పించడం ద్వారా ఈ లక్ష్యం సాధించవచ్చు. ప్రభుత్వ ఆస్పత్రుల్లోనూ తగు రుసుములతో చికిత్స అందించి ప్రైవేటు సేవలతో సమర్థంగా పోటీ పడే అవకాశం కల్పించాలి. ప్రభుత్వం ఉచిత సేవలను దుర్గమ ప్రాంతాల్లో నివసించే ప్రజలకే పరిమితం చేయాలి. పారా మెడికల్ సిబ్బంది కోసం సాధారణ వ్యాధుల చికిత్సకు ఏడాది పాటు శిక్షణ కోర్సు ప్రవేశపెట్టాలి. తద్వారా వైద్యుల కొరతను అధిగమించవచ్చు. అమెరికాలో ఇలాంటి సిబ్బందిని నర్స్ ప్రాక్టీషనర్లుగా పిలుస్తున్నారు. మన దేశంలో ఆర్ఎంపీలను నర్స్ ప్రాక్టీషనర్లుగా మార్చవచ్చు. ప్రస్తుతం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఎలాంటి అర్హత లేకుండానే చికిత్స చేస్తున్న నాటు వైద్యులు చాలామంది ఉన్నారు. వైద్యుల కొరత దీనికి మూలకారణం. దీన్ని అధిగమించాలంటే పెద్దసంఖ్యలో ఎమ్‌బీబీఎస్ వైద్యులను సిద్ధం చేయడమొక్కటే మార్గం. వారు 30 ఏళ్ల వరకు సమాజానికి సేవలు అందించగలుగుతారు. ప్రస్తుతం భారత జనాభాకు కేవలం ఆరున్నర లక్షల మంది వైద్యులు అందుబాటులో ఉన్నారు. ప్రతి 1,700 మంది భారతీయులకు ఒక్క వైద్యుడే ఉన్నట్లు లెక్క. అదే అమెరికాలో ప్రతి 400 మందికి, ఇజ్రాయెల్‌లో ప్రతి 220 మందికి ఒక వైద్యుడు చొప్పున ఉన్నారు. భారత్‌లో వేలాది ఇంజినీరింగ్ కళాశాలలు వెలసినా వైద్య కళాశాలలు వందల్లో కూడా లేవు. ఉన్న ఆ కొద్ది వైద్య కళాశాలల్లోనూ సరైన మౌలిక వసతులు ఉండవు, బోధనా సిబ్బందీ ఉండరు. ఈ కారణాల వల్ల కొన్ని కళాశాలలను భారత వైద్య మండలి (ఐఎమ్‌సీ)

మూసేయించింది. అరకొర జీతభత్యాలను చెల్లించే వైద్య కళాశాలలకు అర్హులైన బోధన సిబ్బంది లభించడం లేదంటే ఆశ్చర్యమేముంది? ఫలితంగా ఉన్న వైద్య కళాశాలలను విస్తరించలేకున్నారు, కొత్త కళాశాలలను నెలకొల్ప లేకపోతున్నారు. 1969 నుంచి పశ్చిమ బంగలో కేవలం రెండు కొత్త వైద్య కళాశాలలు ఏర్పడగా, రాజస్థాన్‌లో 1965 నుంచి కేవలం మూడు, పంజాబులో 1973 నుంచి మూడు, 1971 నుంచి ఢిల్లీలో ఒకటి, బీహార్‌లో రెండు మాత్రమే కొత్త వైద్య కళాశాలలు ఏర్పడ్డాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల్లో మాత్రమే చెప్పుకోదగిన సంఖ్యలో కొత్త వైద్య కళాశాలలు స్థాపితమయ్యాయి. ఇది దేశ అవసరాలకు ఏమాత్రం చాలదు. దేశంలో కొత్త వైద్య కళాశాలల స్థాపనకు తగిన వాతావరణం ఏర్పరచాలి. విధానకర్తలు అందుకు పూనుకోవాలి.

*(ఈనాడు సౌజన్యంతో)*

## ప్రజలకు రూపాయి ఖర్చు లేకుండా..

# దేశంలో 'అందరికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం' అందించటం పూర్తిగా సాధ్యం

## (పీవీ రావు గారి వ్యాసంపై లోక్‌సత్తా టైమ్స్ టీం స్పందన)

*'సంక్షోభంలో గ్రామీణ ఆరోగ్యం' (పడకేసిన పల్లె వైద్యం) పేరుతో రాసిన వ్యాసంలో పీవీ రావు గారు లేవనెత్తిన ప్రశ్నలు ఎంతో అవసరమైనవి.*

*ఆరోగ్యం.. తెలుగు రాష్ట్రాలు, యావత్ భారతదేశం కూడా ఎదుర్కొంటున్న పెద్ద సంక్షోభం అనటంలో సందేహం లేదు. ముఖ్యంగా దేశ జనాభాలో ఇప్పటికీ అత్యధికులు నివసిస్తున్న గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు ఏ కాస్త పౌరసత్వ భావన కలిగినవారైనా తలదించుకునేలా ఉన్నాయి. "తమ జీవితకాలంలో స్పెషలిస్ట్ వైద్యుడ్ని ఒక్కసారైనా చూడని భారతీయుల సంఖ్య 70 కోట్లని" పార్లమెంటరీ స్థాయీ సంఘమే తెలిపింది. వారిలో ఎక్కువశాతం గ్రామీణులే అనటంలో సందేహం లేదు.*

*పట్టణ ప్రాంతాల్లో వైద్యమేదో గొప్పగా అందుతోందని కాదు.. డబ్బులు వదిలించుకున్నా కూడా ఎంతోకొంత ప్రామాణిక వైద్యం కూడా పల్లె ప్రాంతాల్లోని కోట్లాది మందికి అందటం లేదు. జబ్బు తీవ్రత పెరిగినా, దీర్ఘకాలికంగా మారినా తాము అప్పటిదాకా దాచుకున్న డబ్బులతోనో, అప్పులు చేసో, పట్టణ ప్రాంతాల్లో ఎవరైనా కొంత సాయమో, చేబదులో అందించే కుటుంబ సభ్యులు ఉండటంతోనో పట్టణాలు, నగరాలకు వచ్చి వైద్యం చేయించుకోవటం మినహా పల్లెవాసులకు మార్గం లేదు. ఈ మాత్రం ఆర్థిక అండ కూడా లేకుండా కేవలం ప్రభుత్వం వారి స్కీముల మీద ఆధారపడిన పల్లెపేదలకు.. లక్షల రూపాయల ఉచిత వైద్యసేవలు కార్డుల మీద, కాగితాల మీద ఉంటాయిగానీ ఆస్పత్రుల్లో దుర్భర అనుభవాలు తప్పవు.*

*ఈ నేపథ్యంలో ప్రధానంగా గ్రామీణ ఆరోగ్య సంక్షోభం గురించి తగిన ప్రామాణిక గణాంకాలతో పీవీ రావు గారు తన వ్యాసంలో చక్కగా అందించారు. ఇంతవరకూ అభినందనీయమేగానీ, ప్రజారోగ్యానికి ఆయనిచ్చిన పరిష్కారంతో లోక్‌సత్తా నిర్ద్వంద్వంగా విభేదిస్తుంది.*

*రచయితకిగానీ, లోక్‌సత్తాకి గానీ వాస్తవాలు ఒకటే. అయినా లోక్‌సత్తా ఎందుకు విభేదిస్తోంది, లోక్‌సత్తా చూపుతున్న హేతుబద్ధ, ఆచరణీయ పరిష్కారాలు ఏమిటీ అనేది.. రచయిత తన వ్యాసంలో పేర్కొన్న అంశాలవారీగా పరిశీలిద్దాం.*

### *ప్రభుత్వానికి అలవికాని పని అనే వాదనే సహేతుకం కాదు*

*ప్రజలందరికీ ఆరోగ్య సేవలు అందించడం ప్రభుత్వానికి అలవికాని పని అని మొదట అంగీకరించాలి.. అని రావు గారు చెప్పిన మొదటి పరిష్కార వాక్యమే సహేతుకం కాదు.*

*ప్రతి బిడ్డకూ నాణ్యమైన విద్య, ప్రతి కుటుంబానికీ మంచి ప్రమాణాల ఆరోగ్యం అందించటం ఆధునిక ప్రభుత్వాల మౌలిక బాధ్యత.. అనేది ప్రపంచవ్యాప్తంగా విజ్ఞులైన ప్రజాస్వామికవాదులందరూ అంగీకరించే సూత్రం. క్యూబా, చైనా వంటి నియంతృత్వ దేశాల పాలకులు కూడా అంగీకరించి అమలు చేసిన సూత్రమిది. ఈ సూత్రాన్ని పట్టుకుని వాదించటం దగ్గరే లోక్‌సత్తా ఆగిపోవటం లేదు. భారతదేశ విషయంలో ఈ సూత్రం పూర్తిగా ఆచరణసాధ్యం కూడా అని గణాకంసహితంగా చెబుతోంది. ఈ వ్యాసంలోనే రావు గారు జాతీయ ఆరోగ్య మిషన్ గురించి ప్రస్తావించారు. ప్రజారోగ్యంపై వ్యయాన్ని జీడీపీలో ఒక శాతం నుంచి మూడు శాతానికి పెంచే ఉద్దేశంతో 2005లో కేంద్ర ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకాన్ని ప్రారంభించినా,*

పకడ్బందీ విధానం లేకపోవడం పెద్ద లోపం.. అని రాశారు. పకడ్బందీ విధానం కన్నా పాలకులకు రాజకీయ సంకల్పం లేకపోవటం వల్ల ఆనాడు ప్రజలందరికీ ఆరోగ్యసేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం తప్పిపోయింది. జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా జీడీపీలో ఆరోగ్యానికి కేటాయింపులు మూడు శాతం దాకా పెంచి అందరికీ ఆరోగ్యాన్ని అందించే విధానాన్ని లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ సమగ్రంగా డ్రాఫ్ట్ చేశారు. అయితే దాన్ని కత్తిరించి జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకంగా కుదించి అసమగ్రంగా అమలు చేశారు. దీంతో దాదాపు 14 ఏళ్ల సమయం జాతి జీవితంలో వృథా అయింది. ఇక్కడే ఒక ఉదాహరణను ప్రస్తావించాలి. గర్భిణి దశలో మహిళలకు రుబెల్లా వ్యాక్సిన్ ఇవ్వటం వల్ల పుట్టుకతో గుండెజబ్బు రాకుండా నివారించవచ్చని జేపీ వాదిస్తే, దాదాపు 19 ఏళ్ల తర్వాత అది సాకారమైంది. ఆరోగ్యశ్రీ ద్వారా కోట్లు ఖర్చు పెట్టి, ఆ డబ్బుని చాలా సందర్భాల్లో ప్రైవేటు, కార్పొరేటు ఆస్పత్రులకు ధారపోసి గుండె జబ్బు వచ్చిన పిల్లలకు ఆపరేషన్లు చేయించి ప్రచారం, ఓట్లు పొందటానికి ఆరాటపడ్డారుగానీ.. అతితక్కువ ఖర్చుతో రుబెల్లా వ్యాక్సిన్ ఇచ్చి గుండె జబ్బులు రాకుండా నివారిద్దామన్న యోచనను పాలకులు చాలాకాలం చేయలేదు. జేపీ తొలుత చెప్పినప్పుడే స్పందించి ఉంటే నాలుగైదు లక్షలమంది పిల్లల ప్రాణాల్ని జాతి కాపాడుకోగలిగి ఉండేది. జాతీయ ఆరోగ్య మిషన్ విషయంలో జరిగింది కూడా ఈ రకమైన రాజకీయ నిర్లక్ష్యమే.

ఆరోగ్య రంగంలో సమస్య రాజకీయ సంకల్పం కొరవడటమే తప్ప, ఆర్థికంగా అలవికాని భారమవటం కాదు. తన వ్యాసానికి డేటాను సేకరించటంలో చూపిన ప్రామాణికతను రచయిత.. ప్రభుత్వం ఏం చేయాలి, ఖజానాకు సమకూరిన ప్రజల పన్నుల, వనరుల డబ్బును ఏ ప్రాథమ్యాల ప్రకారం ఖర్చు చేయాలి, పరిమిత వనరులతో అపరిమిత అవసరాలను ఎలా తీర్చాలి వంటి అంశాలకు వర్తింప చేయకపోవటం విచారకరం.

ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వ బాధ్యతల్ని, భారతదేశ ఆదాయాన్ని పరిగణలోకి తీసుకుంటే.. వైద్య ఆరోగ్య రంగానికి 3 శాతం కేటాయించటం అసాధ్యమేం కాదు.

"ఆరోగ్యరంగంపై ప్రపంచ సరాసరి వ్యయం జీడీపీలో 5.99శాతంకాగా, భారత్ కేవలం 1శాతానికి కాస్త అటూఇటుగా ఖర్చు చేస్తోంది" అంటే మన ప్రభుత్వాలు ఎంత బాధ్యతారహితంగా పరిపాలిస్తున్నాయో తేటతెల్లమవుతుంది. ప్రస్తుతం మన దేశంలో..

"దేశంలోని మౌలిక వసతుల కల్పనపై చేస్తున్న మొత్తం వ్యయంలో కేవలం 0.21శాతమే ఆరోగ్యరంగంలో వసతులకు ఖర్చు చేస్తున్నారు".

"అందుకే ప్రతి వెయ్యిమందికి 0.5 పడకలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి".

"ముప్పయి రెండున్నర కోట్ల జనాభా ఉన్న అమెరికాలో దాదాపు తొమ్మిది లక్షల ఆసుపత్రి పడకలుంటే, 130 కోట్ల జనాభా ఉన్న మనదేశంలోని 12,760 సర్కారీ ఆసుపత్రుల్లో 5.76లక్షల పడకలే ఉన్నాయి".

"మరోపక్క, దేశంలో ఆరోగ్య సంరక్షణ రంగం ఏటా 15శాతం పెరుగుతోంది".

"2017 సంవత్సరంలో 16వేల కోట్ల డాలర్ల స్థాయికి చేరుకున్న ఆరోగ్య రక్షణ రంగం, 2020 కల్లా 28వేల కోట్ల డాలర్లకు చేరుకోనుంది. 2000–17 మధ్యకాలంలో ఈ రంగానికి అందిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 434 కోట్ల డాలర్లు. 2015లో విదేశాల నుంచి వైద్యం కోసం భారత్‌కు వచ్చిన రోగుల సంఖ్య 1.30లక్షలు. 2016కల్లా వారి సంఖ్య రెండు లక్షలకు చేరింది. వైద్య రంగంలో ప్రైవేటు, విదేశీ పెట్టుబడులకు లాభాలు వర్ధిల్లుతుండగా, సాధారణ ప్రజలకు మాత్రం మెరుగైన సేవలు లభించడం లేదు".

"గత పదేళ్లలో చికిత్స ఖర్చులు ద్రవ్యోల్బణాన్ని మించి పెరిగాయి".

ఈ మొత్తం నేపథ్యాన్ని చూస్తే.. ప్రజలకు జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా మంచి ఆరోగ్యాన్ని అందించటం భారతదేశానికి అవసరం, ఆచరణసాధ్యం అని అర్థమవుతుంది. ఈ బాధ్యత నుంచి వైదొలగాలన్న రాజకీయ నేతలకు వత్తాసు పలికేలా రావుగారి లాంటి ఆలోచనాపరులు మాట్లాడటం అసమంజసమే కాదు, అన్యాయం కూడా.

**3 శాతం కూడా అక్కర్లేదు**

జీడీపీలో 3 శాతం కూడా పూర్తిగా ఇప్పటికిప్పుడు ఇవ్వనక్కర్లేదని, 2–3 శాతం మధ్యలో ఇచ్చినా ప్రజలందరికీ ఉచితంగా మంచి ఆరోగ్యాన్ని అందించవచ్చని లోక్‌సత్తా హెల్త్ ఫర్ ఆల్ బిల్లును రూపొందించి 2016లో కేంద్ర ప్రభుత్వానికి అందించింది. జాతీయ ఆరోగ్య మిషన్ రూపకర్తగా తనకున్న అనుభవాన్ని, ఇతర దేశాల అనుభవాల్ని రంగరించి దేశీయ పరిస్థితులకనుగుణంగా డా॥ జేపీ రూపొందించిన బిల్లు అది.

**2 కోట్ల దాకా ఉద్యోగాలు కూడా వస్తాయి**

పీవీ రావు గారు ఇంకో కీలకమైన విషయాన్ని విస్మరించారని ఇక్కడే ప్రస్తావించాలి. మన ఆర్థికవ్యవస్థ పెరగటానికి, సమాజంలో రాజకీయ–ఆర్థిక–సామాజిక

సమతుల్యత నెలకొనడానికి ప్రజలకు ఉద్యోగావకాశాలు కీలకమని వారికి తెలియనిదేమీ కాదు. స్వదేశీ, విదేశీ తేడా లేకుండా పెట్టుబడిదారులకు మనం ఇస్తున్న రాయితీలు పూర్తిగా ఉపాధి అవకాశాల ప్రాతిపదికన ఉండాలని ఇటీవల దాదాపు అందరూ సూచిస్తున్నారు. ఉద్యోగాల కోసం ప్రభుత్వం కూడా సొంతంగా పెద్దఎత్తున వ్యయం చేయడానికి వెనుకాడటం లేదు. నిరుద్యోగ భృతి వంటి పథకాలూ ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో దాదాపు 2 కోట్ల ఉద్యోగావకాశాలనిచ్చే ఆరోగ్య విధానం మీద కొద్దిపాటి వ్యయాన్ని పెంచటం అలవిమాలిన ఖర్చు ఎలా అవుతుంది? లోక్‌సత్తా 'అందరికీ ఆరోగ్యం' విధానం ద్వారా దాదాపు 2 కోట్ల ఉద్యోగాలు వస్తాయి. చాలా తక్కువ రంగాల్లో మాత్రమే ఈ అవకాశం ఉంది.

"ప్రజారోగ్య సౌకర్యాలు కొరవడి, ఉత్పాదక శక్తి పడిపోవడం వల్ల భారత్ ఏటా 60లక్షల కోట్ల రూపాయలు నష్టపోతోంది" అని ఓ అధ్యయనంలో తేలిందంటే.. అందరికీ ఆరోగ్యం వల్ల దేశానికి ఎంత ఆర్థిక బలిమి సమకూరుతుందో అర్థం చేసుకోవచ్చు.

**పేదల సంఖ్య జనాభా సంఖ్య కంటే ఎక్కువగా చూపుతున్న సందర్భాలు అనేకం**

అలాగే పేదలకు మాత్రం నగదు బదిలీ (ఔట్ పేషెంట్), బీమా పద్ధతుల్లో వైద్య సేవల్ని అందించాలని రచయిత సూచించారు. దుర్గమ ప్రాంతాల్లో ఉండేవారికి మాత్రమే ఉచిత సేవల్ని అందించాలన్నారు. కానీ, మనదేశంలో పేదరికం ప్రాతిపదికగా ఉండే పథకాల్లో జనాభా సంఖ్య కంటే ఎక్కువమంది లబ్ధి పొందుతున్న ఉదంతాలున్నాయి. తాజా ఉదాహరణను తీసుకుంటే, నూతన ఆంధ్రప్రదేశ్‌లో 2016లో ప్రారంభించిన ప్రజాసాధికార సర్వేలో తేలిన కుటుంబాల కంటే ప్రజాపంపిణీకి ఉద్దేశించిన రేషన్ కార్డులే ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్రంలో 1,41,13,797 కుటుంబాలుండగా, కార్డులు మాత్రం ఇప్పటికే 1,44,00,630 మందికి ఇచ్చారు. అంటే 2,86,833 కుటుంబాలకు అదనంగా కార్డులు ఇచ్చారు. ఇవి కాక మరో 5.84 లక్షల మంది కార్డుల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. ఈ లెక్కప్రకారం ఏపీలో పేదలే లేరు.

**పేదరికానికి అతిపెద్ద కారణం చికిత్సకవుతున్న ఖర్చులే!**

పేదలను గుర్తించటం ఒక సమస్యయితే, ప్రజలకు వైద్య చికిత్సకు అవుతున్న ఖర్చులే మనదేశంలో పేదరికానికి అతి పెద్ద కారణంగా ఉన్నాయనేది ఇక్కడ పరిగణలోకి తీసుకోవాల్సిన చేదు వాస్తవం. అప్పటిదాకా పేదలు కానివారు, పేదరికం నుంచి బైటపడ్డవారు.. కేవలం చికిత్సకు అవుతున్న ఖర్చుల భారం వల్ల పేదలుగా మారుతున్నారు లేదా పేదరికంలోకి తిరిగి జారిపోతున్నారు. కొన్ని సర్వేలు, అధ్యయనాలు చెప్పింది చూడండి..

"చికిత్సకయ్యే ఖర్చులే దేశ పేదరికంలో ఆరో వంతుకు కారణమని ముంబయిలోని టాటా సామాజిక శాస్త్ర పరిశోధన సంస్థ 2011లో చేసిన అధ్యయనం నిర్ధారించింది".

"మనదేశంలో ఏటా 4కోట్లమంది వైద్యఖర్చుల వల్ల దారిద్ర్యంలో కూరుకుపోతున్నారని రాష్ట్రపతిగా ప్రణబ్ ముఖర్జీ 'ఎయిమ్స్' 40వ స్నాతకోత్సవంలో పేర్కొన్నారు",

"మన దేశ ఆరోగ్య సంరక్షణ వ్యయంలో ప్రభుత్వ వాటా 30శాతం కన్నా తక్కువే. మిగిలినదంతా ప్రజలు జేబుల్లో నుంచే ఖర్చు చేస్తున్నారు".

"57శాతం గ్రామీణులు ఆర్థిక స్తోమత లేక సరైన వైద్యం చేయించుకోలేక పోతున్నారు".

"గ్రామాల్లో 68శాతం మంది చికిత్స కోసం కుటుంబ ఆదాయం, పొదుపు మొత్తాలపై ఆధారపడుతుండగా, 25శాతం మంది అప్పుల్ని ఆశ్రయిస్తున్నారు. పట్టణ కుటుంబాలు 18శాతం మేర అప్పులు తెచ్చుకుంటున్నారు".

"సంపన్నులు ఏటా తాము వస్తుసేవలపై చేస్తున్న వ్యయానికి సమానమైన మొత్తాన్ని ఆసుపత్రి చికిత్సకు వెచ్చిస్తున్నారు. పేదప్రజలు తమ వార్షిక ఆదాయానికి రెట్టింపు సొమ్మును వైద్య చికిత్సలకు వెచ్చించాల్సి వస్తోంది".

"2014 లెక్కల ప్రకారం ఏటా ప్రతి వెయ్యిమందిలో 44మంది ఆసుపత్రి పాలవుతున్నారు. 2004-2014 మధ్యకాలంలో వైద్యఖర్చులు సగటున పట్టణ ప్రాంతాల్లో 176శాతం పెరగ్గా, గ్రామీణ ప్రాంతాల్లో ఇవి 160శాతం అధికమయ్యాయి. ఆసుపత్రిలో చికిత్స పొందటానికి ఒక్కొక్కరికి పట్టణ ప్రాంతాల్లో రూ.25,000, పల్లె ప్రాంతాల్లో 15,000 అవుతోంది. పల్లెల్లో ప్రతి శిశు జననానికి సగటున రూ.5,544 ఖర్చయితే, పట్టణాల్లో రూ.11,685 వ్యయమవుతోంది".

"చేతిలో డబ్బు లేకపోవటం వల్ల చాలామంది పేదలు సకాలంలో చికిత్స చేయించుకోలేకపోతున్నారు. దీనివల్ల వ్యాధులు ముదిరి ప్రాణాంతకమవుతున్నాయి".

**పేదలకే రాయితీలంటే.. పేదరికాన్ని నిరంతరం కొనసాగించటమే అవుతుంది**

ఈ నేపథ్యంలో.. చికిత్సకవుతున్న ఖర్చుల కారణంగా కోట్ల మంది పేదలుగా మారుతున్నప్పుడు.. ఆర్థిక భారం లేని వైద్యసేవల్ని 'అందరికీ' అందించటం వల్ల పేదరికాన్ని నిర్మూలించటం సాధ్యమవుతుంది తప్ప, కొందరికే అందించటం వల్ల కాదు.

పీవీ రావుగారు చెప్పినట్లు, కేవలం పేదలకే వైద్య ఆరోగ్య సేవలలో రాయితీల్ని వర్తింపచేయడమంటే, పేదరికాన్ని నిరంతరం కొనసాగించటమే అవుతుంది తప్ప, పేదరికాన్ని నిర్మూలించటమవదు. ఇది మన రాజకీయ నాయకులు ఓట్ల కోసం ఆడుతున్న చౌకబారు రాజకీయానికి కొనసాగింపే అవుతుంది. సామాన్య ప్రజల కంటే అనేకరెట్లు జీవన భద్రత కలిగిన ప్రభుత్వోద్యోగులకు ఇస్తున్న ఉచిత వైద్యసదుపాయాన్ని మిగిలిన ప్రజానీకాన్ని వర్తింప చేయరా? ప్రజలు ద్వితీయశ్రేణి పౌరులా?

అలాగే కేవలం పేదలకే కాకుండా అందరికీ ఖర్చు లేకుండా నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించటం వల్ల ఆస్పత్రుల్లో సేవలకు డిమాండ్ చేసే వారు తయారవుతారు. దీనివల్ల ఆరోగ్య సేవలు ప్రామాణికంగా అందుబాటులోకి రావటం కూడా మొదలవుతుంది.

**ఔట్‌పేషెంట్ సేవలను అందించినా కూడా ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రులకే లాభం చేకూరుతుంది**

పీవీ రావు గారు ఏ రూపంలో చెప్పినా అంతిమంగా పేదలందరికీ పెద్దఎత్తున రాయితీతో వైద్య సేవలు అందుబాటులోకి రావాలన్నట్లు చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రులు కూడా కొంత రుసుమును వసూలు చేయాలని, ప్రభుత్వ ఆస్పత్రిని ఎంచుకోవాలా, ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలా అనేది ఆ పేదలే నిర్ణయించుకోవాలని చెప్పారు.

ఇక్కడ ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల్లో ఏది ఎంచుకోవాలన్నది పెద్ద సమస్య కాదు గానీ.. పేదలకు ప్రాథమిక స్థాయిలో నగదు బదిలీ ద్వారా రీఇంబర్స్‌మెంట్, వ్యాధి ముదిరాక బీమా ఆధారిత రీఇంబర్స్‌మెంట్ అంటే కచ్చితంగా ప్రైవేటు, కార్పొరేటు ఆస్పత్రులకే ఎక్కువ లబ్ధి చేకూరుతుంది. వ్యాధిని నయం చేసే ధోరణితో కాకుండా ప్రభుత్వం నుంచి ఇంకాఇంకా డబ్బు గుంజే ధోరణితోనే వీరు వ్యవహరించే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందుకే బీమా ఆధారిత వైద్యసేవల్ని అందిస్తున్న అమెరికాలో వైద్యానికి ప్రభుత్వం జీడీపీలో 17 శాతం దాకా ఖర్చు చేస్తున్నా, అక్కడ ప్రజలకు సరైన వైద్యసేవలు అందటం లేదు. తలసరి 11,000 డాలర్లను (రూ. 7,70,000) ఖర్చు చేస్తున్నా ఆరోగ్య సేవల్లో అమెరికా 34 దేశాలకంటే వెనుకబడి ఉంది. అందులో పనిచేసే జనాభాలో 90శాతానికిపైగా అసంఘటిత రంగంలో ఉన్న మన దేశంలో ఇన్సూరెన్స్ ఆధారిత వైద్య పద్ధతి ద్వారా దోపిడీకి ఇంకా ఎక్కువ అవకాశాలుంటాయి. మనదేశంలో ఆరోగ్యశ్రీ వంటి స్కీములపై వచ్చిన కొన్ని నివేదికల్లోని ఈ మాటలు కూడా హెచ్చరిస్తున్నాయి.

"జబ్బు ముదిరాక అందించే ద్వితీయ, తృతీయ అంచె వైద్యసేవలు లాభదాయకం కాబట్టి ప్రైవేటు రంగం వీటిపైనే ఎక్కువ నిధులు ఖర్చు పెడుతోంది. అందువల్లే.. ప్రాథమికాన్ని నిర్లక్ష్యం చేసే ప్రభుత్వ ఆరోగ్య స్కీములు ప్రైవేటు, కార్పొరేట్‌లకు లాభసాటి వ్యాపారంగా మారాయి. ప్రైవేటు రంగ నిధుల్లో 38.1శాతం ద్వితీయ అంచెపైన, 17.1శాతం తృతీయ అంచె సేవలపైన ఖర్చు చేస్తున్నారు".

"ఆరోగ్యశ్రీ సహా ప్రభుత్వ ఆరోగ్య పథకాల వల్ల పేద, మధ్యతరగతివారికి ఒనగూరే మేలుకన్నా, వైద్యశాలలకు మిగిలే లాభాలే అధికం".

పేదరికాన్ని నిర్మూలిస్తూ ప్రైవేటు వర్గాల దోపిడీని నిరోధించే విధానాన్ని రూపొందించాలి

ఈ నేపథ్యంలో అందరికీ ఆరోగ్యాన్ని అందిస్తూ పేదల సంఖ్య పెరగకుండా చూడటం, ప్రభుత్వం చేసే వ్యయాన్ని ప్రైవేటు వర్గాలు దుర్వినియోగం చేయకుండా ప్రతి రూపాయీ ప్రజల వైద్యానికే ఉపయోగపడేలా చేయటం అవసరం. టీకాలు, పారిశుద్ధ్యం, అవగాహన వంటి ఏర్పాట్లతో వ్యాధి రాకుండా నివారించటం, ప్రాథమిక చికిత్స, మధ్యస్థాయి వైద్యం, తృతీయదశ వైద్యం అన్నీ సమర్థవంతంగా అందే ఏర్పాటు చేయటం అవసరం. ఇవన్నీ నెరవేర్చే శక్తి బ్రిటన్‌లో దశాబ్దాలుగా విజయవంతంగా అమలవుతున్న "సార్వత్రిక ఆరోగ్య పథకం" (ఎన్‌హెచ్ఎస్)ను భారత్‌లో అమలు చేయటం ఎంతో ప్రయోజనకరం. ఇందులో ఉన్న ఫ్యామిలీ డాక్టర్ పద్ధతిని మన దేశంలో అమలు చేయటం వల్ల ప్రజలు డబ్బుల్ని తీసుకెళ్లి ప్రైవేటు వర్గాలకు పోయకుండా, తమ అనారోగ్యం గురించి, చికిత్సకు ఏ మేరకు ఏ చర్యలు అవసరం వంటివి స్పష్టంగా తెలుసుకుని వైద్యసేవల్ని పొందగలుగుతారు. ప్రతి రూపాయీ సద్వినియోగం అయ్యేలా చూసే బాధ్యత ఫ్యామిలీ డాక్టర్ మీదే ఉంటుంది.

వైద్యుల కొరత గురించి..

ఇక వైద్యుల కొరత గురించి రావు గారు ప్రస్తావించారు. కొన్ని కోణాల్లో పరిస్థితి వారు చెప్పినదానికన్నా అధ్వాన్నంగా ఉంది. ప్రతి 1,700 మంది భారతీయులకు ఒక్క వైద్యుడే ఉన్నట్లు లెక్క.. అని రాశారు. కానీ ప్రామాణిక వైద్యుల లెక్కన చూస్తే పరిస్థితి ఇంకా అధ్వాన్నంగా ఉంది. "మనదేశంలో సగటున 11వేల మందికి ఒక అల్లోపతి డాక్టర్ ఉన్నారు. ఉన్న చాలీచాలని సిబ్బందిలోనూ 57శాతానికి ప్రామాణిక అర్హతలు లేవు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిబంధనావళి ప్రకారం జనాభాలో ప్రతి వెయ్యిమందికీ ఒక వైద్యుడు ఉండాలి".

పీవీ రావు గారు చెప్పినట్లు, తగిన శిక్షణతో నర్సు ప్రాక్టీషనర్లను తయారుచేయటం వంటి పరిష్కారాలను ఇక్కడ

ఉపయోగించుకోవచ్చు. అలాగే మనదేశంలో ఎంబీబీఎస్ చదివి, తగిన ఆదాయం లేని వైద్యులు లక్షల సంఖ్యలో ఉన్నారు. వీరిని కొంత శిక్షణతో ఫ్యామిలీ డాక్టర్లుగా ఉపయోగించుకోవచ్చు. అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అద్భుతంగా ఉపయోగించుకుంటూ కొరతల్ని అధిగమించవచ్చు. ఉన్న వైద్యుల నైపుణ్యాలకు సానపడుతూ, కొత్త వైద్యులను తయారు చేసుకుంటూనే ఇవన్నీ చేయాలి.

అలాగే, మందుల తయారీలో భారత్‌కున్న ప్రపంచస్థాయి ఆధిక్యత ఓ పెద్ద అవకాశం. జనరిక్ మందుల్ని ఉచితంగా అందరికీ అందుబాటులోకి తేవచ్చు.

ఈ కొత్త ఏర్పాట్లతోపాటు.. ఇప్పుడున్న పద్ధతుల్లోని లోపాల్ని కూడా సరిచేసుకోవాలి. ప్రస్తుతం ప్రభుత్వాలు వైద్య ఆరోగ్యానికి వెచ్చిస్తున్న డబ్బును కూడా సద్వినియోగం చేయటం లేదు. ఎంతో కష్టానికి, త్యాగానికి ఓర్చి, ఎన్నో ఏళ్లపాటు శ్రమించి వైద్యులుగా మారినవారికి ప్రభుత్వంలో ఇస్తున్న వేతనాలు, ప్రోత్సాహకాలు దారుణంగా ఉన్నాయి. ప్రభుత్వంలో ఏ పనీ చేయకుండా కేవలం పోస్టింగ్‌లో ఉన్న అదృష్టానికి రూ.2లక్షలు దాకా ఇస్తున్నారుగానీ, ఉన్న పడకలకు మించి వందల సంఖ్యలో రోజూ పేషెంట్లను చూస్తున్న వైద్యులకు గరిష్ఠంగా రూ.50 వేల దాకా మాత్రమే జీతం ఇస్తున్నారు. ఇలాంటివన్నీ సరిచేస్తూ, బ్రిటన్ తరహాలో అందరికీ ఆరోగ్యాన్ని గ్యారంటీ చేసే విధానాన్ని మన దేశంలో కూడా అమలు చేయాలి. ప్రభుత్వ ఆస్పత్రులా, ప్రైవేటు ఆస్పత్రులా అని తేడా లేకుండా 'ప్రభుత్వమే ప్రజల ఆరోగ్యానికి బాధ్యత' తీసుకోవాలి. క్రమంగా ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేయాలి. అప్పుడు అందరికీ ఆరోగ్యం అందుబాటులోకి రావటంతోపాటు క్రమంగా ఖజానాపై కూడా ఆరోగ్యభారం తగ్గుతుంది. ప్రభుత్వం అదనపు పన్నుల్ని వేసినా ప్రజలు సంతోషంగా చెల్లించడానికి ముందుకొస్తారు. వీటన్నింటినీ పరిగణలోకి తీసుకునే లోక్‌సత్తా ఆరోగ్య పథకాన్ని రూపొందించింది.

తనకు ఆరోగ్య సమస్య వస్తే కనీసం మందు బిళ్ల కూడా వేసుకోనని ప్రధానిగా నరేంద్రమోదీ ఆ మధ్య ఓ ఇంటర్వ్యూలో చెప్పారు. యోగా చేయటం వల్ల అనేక రుగ్మతల నుంచి బైటపడవచ్చని చెప్పారు. పెరుగుతున్న జీవనశైలి వ్యాధులను దృష్టిలో పెట్టుకుని ఆయన ఆలోచించి ఉండొచ్చు. యోగా, బీమాలతో ఆరోగ్యం అందించేయొచ్చని 'ఆయుష్మాన్ భారత్' స్కీమును జోడించారు. జీవనశైలి వ్యాధులు పెరిగిపోతుండటం, పారిశుద్ధ్యం, రక్షిత మంచినీరు వంటి సమస్యలన్నీ ఆరోగ్యంతో ముడిపడి ఉన్నాయన్నది వాస్తవం. ఇందుకు స్థానిక ప్రభుత్వాల సాధికారత వంటి ఇతరత్రా అంశాలను కూడా సాధించుకోవాల్సి ఉంది. కానీ ఆరోగ్యం – చికిత్సకంటూ ప్రత్యేకంగా ఒక నిర్దిష్టమైన విధానం హేతుబద్ధంగా, ఆచరణీయంగా ఉండాలి. అంతిమంగా ప్రజలకు ఆర్థికభారం లేకుండా ఆరోగ్యం సమకూరాలి.

ఫ్యామిలీ డాక్టర్ చుట్టూ అందరికీ ఆరోగ్యం విధానాన్ని అమలు చేయాలి

అందుకు ప్రాథమిక స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ ఏర్పాటుతో, పేదలకే పరిమితం కాకుండా అందరికీ ఆరోగ్యాన్ని అందించే విధానాన్ని అమల్లోకి తేవటం మాత్రమే సరైన పరిష్కారం. ఈ ఫ్రేమ్‌వర్క్‌లోకి యోగ, ఆయుర్వేదం వంటి ఇతరత్రా వైద్యవిధానాలను కూడా నిరూపిత ఫలితాలకనుగుణంగా చేర్చవచ్చు. పరిమిత ఇన్సూరెన్స్‌ను (సంఘటిత రంగంలోని వారికి) అనుమతించవచ్చు. సాధికార స్థానిక ప్రభుత్వాలను, స్త్రీ, శిశు సంక్షేమ, (పౌష్టిక) ఆహార, పర్యావరణ శాఖలను ప్రాధాన్యతలమేర అనుసంధానించవచ్చు.

సార్వత్రిక ఆదాయ పథకాన్ని అమలు చేసినా.. ఆరోగ్యం అందించటంలో రాజీ పడకూడదు

ప్రభుత్వాలు ఎన్ని భృతుల్ని ఇచ్చినా, పేదలకు ఆదాయ పథకం (న్యాయ్), సార్వత్రిక ఆదాయ పథకం (యూబీఐ) వంటివి అమలు చేసినా.. విద్య, ఆరోగ్యం, చట్టబద్ధపాలన వంటి మౌలిక బాధ్యతల్ని విస్మరించకుండా చేస్తుండాలి. ప్రజల్ని ప్రభువులుగా చేసే ఈ నిర్మాణానికి కాకుండా.. పైస్థాయిలో ఉండే ఓ 10–20 శాతం మంది సాంకేతిక పరిజ్ఞానం, తాత్కాలిక తాయిలాలు, ఆటవిక భావోద్వేగాలతో మిగిలిన 80 శాతం మందిపై శాశ్వతంగా పెత్తనం చేసే నిర్మాణానికి మొగ్గు చూపటమంటే ఇక ప్రజాస్వామ్యానికే అర్థముండదు. మనకంటే ఎక్కువ జనాభా ఉన్న నియంతృత్వ దేశం చైనా కూడా మనకంటే మెరుగ్గా ఆరోగ్య సేవలను అందిస్తోంది. ఆరోగ్య ర్యాంకుల్లో భారత్ కంటే చైనా దాదాపు 70 స్థానాలు ముందుంది. పీవీ రావు గారి లాంటి ఆలోచనాపరులు పరిష్కారాలకి మరింత విస్తృత ప్రజాప్రయోజనాల్ని ప్రాతిపదికగా చేసుకుని భావాల్ని ప్రచారం చేసినప్పుడే మార్పు, ప్రజాస్వామిక పరిణతి వేగవంతమవుతాయి, భారతదేశం తన శక్తిసామర్థ్యాలను వికసింప చేసుకుని ప్రపంచస్థాయి దేశంగా రూపుదిద్దుకుంటుంది.

లోక్‌సత్తా రూపొందించిన ఆరోగ్య విధానంపై మరింత స్పష్టత కోసం ఆ వివరాలను కూడా స్థూలంగా ఈ వ్యాసం తర్వాత అందిస్తున్నాం. ◆

# మోదీ ప్రభుత్వానికి ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా అందించిన ‘అందరికీ ఆరోగ్యం’ విధానం నమూనాలోని ముఖ్యాంశాలు

ప్రపంచ దేశాల అనుభవాల్ని అధ్యయనం చేసి భారతీయ పరిస్థితుల కనుగుణంగా జేపీ రూపొందించిన జాతీయ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం)ను గ్రామీణ హెల్త్ మిషన్‌గా కుదించి పలు పరిమితులతో 2005లో యూపీయే ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. జాతీయ హెల్త్ మిషన్ రూపకర్తగా, ప్రపంచ దేశాల విధానాలను మారిన పరిణామాలకనుగుణంగా తిరిగి అధ్యయనం చేసి 2016లో దేశీయ ఆరోగ్య నమూనా విధానాన్ని జేపీ రూపొందించి నీతి ఆయోగ్ ద్వారా కేంద్రంలోని మోదీ ప్రభుత్వానికి అందజేశారు. ప్రభుత్వ బాధ్యతతో అమలయ్యే ఈ విధానానికి ప్రైవేటు, కార్పొరేట్ రంగం చిక్కులు సృష్టించకుండా వారిని కూడా చాలావరకు ఒప్పించారు. ఇందుకోసం పలు సమావేశాల్ని నిర్వహించారు. పలు ఆస్పత్రుల్ని సందర్శించారు.

ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా ‘అందరికీ ఆరోగ్యం’ విధానం తాజా నమూనాలోని ముఖ్యాంశాలు..




**ప్రాథమిక స్థాయిలో జీతాల విధానం బదులు నచ్చిన ఫ్యామిలీ ఫిజిషియన్‌ను ప్రజలు ఎంచుకునే విధానం**

లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ నమూనాలో గ్రామస్థాయి నుంచి ప్రతి కుటుంబానికి కొంతమంది ఫిజీషియన్లు అందుబాటులో ఉంటారు. వీరికి జీతాలిచ్చే వ్యవస్థ లేకుండా, సేవలతో పోటీపడి సంపాదించుకునే విధానం ఉంటుంది. వీరు ఎంబీబీఎస్ చదివి ఫ్యామిలీ ఫిజీషియన్లుగా శిక్షణ పొందినవారై ఉంటారు. ఈ వైద్యులు తాము ఎంపికచేసుకున్న గ్రామాలకు వెళ్లి అక్కడ ప్రజలు తమ వైద్యసేవలు తీసుకునేట్లుగా రిజిస్టర్ చేసుకుంటారు. ఈ ప్యానల్ నుంచి తమకు నచ్చిన డాక్టర్‌ని ప్రజలు ఎంచుకోవచ్చు. రిజిస్టర్ అయిన ఒక్కో వ్యక్తికీ వైద్యసేవల కోసం ప్రభుత్వం కాస్త అటూఇటుగా ఏటా రూ.600 వైద్యునికి చెల్లిస్తుంది. ఎంత ఎక్కువమంది ప్రజలను వైద్యుడు/వైద్యురాలు నమోదుచేసుకుంటే అంత ఎక్కువ ఆదాయం వారికి వస్తుంది. ఇలా ఓ మెరుగైన వైద్యునికి ఏడాదికి రూ.30లక్షలకు పైగా కనీస ఆదాయం వచ్చే అవకాశం ఉంటుంది. గ్రామాలలో సేవలందించటానికి వారు గ్రామంలో నివాసముండాలనే నిబంధన ఉండదు. అందుబాటులో ఉండేలా సమీప పట్టణంలో ఉండవచ్చు. పట్టణాల్లో, నగరాల్లో విపరీత పోటీని ఎదుర్కొంటున్న వైద్యులకు ఇది సువర్ణావకాశమే అవుతుంది. ఇక్కడ జెనెరిక్ మందుల్ని ఉచితంగా అందిస్తారు, టీకాలు వంటి కార్యక్రమాల్ని చేస్తారు. ప్రభుత్వం జీతాలిచ్చే ప్రస్తుత వ్యవస్థకు ఇది విప్లవాత్మకమయిన ప్రత్యామ్నాయం.

**రెండోదశలో తాలూకా స్థాయిలో ప్రభుత్వ కమ్యూనిటీ సెంటర్లు-ప్రయివేటు నర్సింగ్ హోంల మధ్య పోటీ**

రెండోదశ వ్యాధుల చికిత్సలో తాలూకా స్థాయిలో ప్రభుత్వం ఆధ్వర్యంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లకు, ప్రయివేటు నర్సింగ్ హోంలకు మధ్య పోటీ ఉంటుంది. ప్రసూతి కేసుల దగ్గర్నుంచి ఎవరు మెరుగైన చికిత్సనందిస్తే, సేవలనందిస్తే వారికి ఆకర్షణీయ చెల్లింపులు ఉండేలా ఈ దశలో ఏర్పాటు ఉంటుంది. ప్రతి వ్యక్తి ఆరోగ్య రికార్డుల్ని నమోదు చేసి మొత్తం దేశ ఆరోగ్యరికార్డుని తయారుచేస్తారు. ఇప్పటివరకూ ప్రభుత్వం కేవలం కొన్ని రకాల జబ్బులకు మాత్రమే పీపీపీ నమూనాలో ప్రయివేటు వైద్యులకు చెల్లిస్తోంది. లోక్‌సత్తా నమూనాలో ఏ జబ్బుకైనా మెరుగైన ఆసుపత్రిని ఎంపికచేసుకునే అవకాశం ప్రజలకు అందుబాటులో ఉంటుంది.

**తృతీయ దశలో జిల్లాస్థాయిలో ఎయిమ్స్‌లాంటి ప్రభుత్వ వైద్యసంస్థలు**

## అభివృద్ధికి ప్రధాన సంకేతం ఆరోగ్యం

**-డా॥ జయప్రకాష్ నారాయణ్**

అభివృద్ధికి ప్రధాన సంకేతం మనిషి ఆరోగ్యం. కానీ మనదేశంలో ఇప్పటికీ అకాల మరణాలు, నివారించదగ్గ వ్యాధులు, సులభంగా చికిత్స చేయదగ్గ జబ్బులు అసంఖ్యాకంగా అమాయకుల్ని బలితీసుకుంటున్నాయి. నివారించదగ్గ క్లేశాలు భారతదేశంలో ఉన్నంతగా మరెక్కడా కానరావు. ఇందుకు చాలా సులభ పరిష్కారాలు మన ముందున్నాయి. చాలా తక్కువ ఖర్చుతో అమలయ్యే మార్గాలనేకం ఉన్నాయి. ఉదాహరణకు మహారాష్ట్రలో అహ్మద్‌నగర్ జిల్లాలోని జాంఖేడ్‌లో డాక్టర్ అరోలీ దంపతులు దశాబ్దాల క్రితం తక్కువ ఖర్చుతో, స్థానిక వనరులతో, అక్కడి ప్రజల భాగస్వామ్యంతో సాధించిన ఆరోగ్య ఫలితాలు చూస్తే- మన సమస్యలను ఎంత సులభంగా పరిష్కరించవచ్చో విశదమవుతుంది. వెల్లూరు వైద్య కళాశాలలో పట్టభద్రులయిన డాక్టర్ రజనీకాంత్ అరోలీ, ఆయన భార్య మేబెల్- ఇరువురూ అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం చేసి 1970లో మహారాష్ట్రలో మారుమూల ప్రాంతమయిన జాంఖేడ్‌లో నివాసమేర్పరచుకున్నారు. ఆ దంపతులకు ఆనాటికే ఓ విషయం స్పష్టంగా తెలిసివచ్చింది. నూటికి 90 జబ్బులకు ఖరీదయిన వైద్యం అక్కర్లేదు. ఎన్నో అంటువ్యాధులను సులభంగా గుర్తించి చికిత్స చేయవచ్చు. చాలా రోగాలకు వ్యాధి నిరోధక టీకాలిస్తే జబ్బు రాకుండా నివారించవచ్చు. తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకుంటే ఎన్నో రకాల జబ్బుల నుంచి కాపాడుకోవచ్చు. పౌష్టికాహారం మెళకువలను పాటిస్తే చాలా వ్యాధులను నిరోధించవచ్చు. మాతాశిశు సంరక్షణ సూత్రాలను పాటిస్తే ఎందరో గర్భిణులను, పసిపాపలను రక్షించవచ్చు. వీటన్నింటికీ వైద్యులే అవసరం లేదు. అలాగని అసలు వైద్యులు అవసరమే లేదని కాదు. కొన్ని క్లిష్టమయిన వ్యాధులను గుర్తించడానికి, సరైన చికిత్స చేయటానికి, శస్త్రచికిత్సలకు, కొన్ని మందుల వాడకానికి విధిగా వైద్యులు కావాలి. ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణనివ్వటం కోసం, వైద్యుడి సహాయం అవసరమున్న రోగులకు చికిత్సనందించటం కోసం జాంఖేడ్‌లో అరోలీ దంపతులు ఓ చిన్న ఆసుపత్రిని ఏర్పాటు చేశారు. వారి కృషి వల్ల అనతికాలంలోనే అసాధారణ ఫలితాలు వచ్చాయి. 1970ల చివరినాటికి ఆ 70 గ్రామాలలోని లక్ష జనాభాకు ఆధునిక ఆరోగ్య పద్ధతులు అందుబాటులోకి వచ్చాయి. ఆ ప్రజల ఆరోగ్య ప్రమాణాలు-జీవన కాలపరిమితి, మాతా శిశు మరణాలు, వివిధ వ్యాధులకు గురయ్యేవారి సంఖ్య వగైరా అంశాలలో- ప్రపంచంలో సంపన్న దేశాలకు ఏరకంగానూ తీసిపోకుండా అద్భుత ఫలితాలు సాధించగలిగారు. 1979లో అరోలీ దంపతులకు మెగసెసే అవార్డు అందింది. ఆరో పంచవర్ష ప్రణాళికకు ఆరోగ్యరంగంలో జాతీయ సలహాదారుగా అరోలీని మన ప్రభుత్వం నియమించింది. ఆయన కృషిని అందరూ పొగిడారు. కాగితం మీద ఆ విధానాలనే రాసిపెట్టారు. కానీ వాస్తవానికి ప్రజలకు ఆరోగ్యం అందకుండా చేశారు. గ్రామీణ మహిళలను ఎంపికచేసి శిక్షణనిచ్చేది పోయి, పలుకుబడి గలవాళ్ల పిల్లలను ఎంపికచేశారు. ప్రజలకు ఆరోగ్యం అందించే లక్ష్యంతోకాక ప్రభుత్వోద్యోగం దక్కి నెల జీతం వస్తుందనే ఆశతో వేలమంది యువకులు లంచాలిచ్చి ఆరోగ్య కార్యకర్తలుగా చేరారు. నాయకులకు, అధికారులకు చిత్తశుద్ధి, సంకల్పం, అవగాహన, సామర్థ్యం కొరవడటంతో ఆ పథకం నీరుగారిపోయింది. ఇప్పుడు పాలకులలో చాలామందికి అసలు అరోలీ పేరే తెలియదు. గూండాలకు నీరాజనాలందించి, లంచగొండులను నెత్తికెక్కించుకుని, అసమర్థులను అందలాలెక్కించే వ్యవస్థలో నిజంగా దేశాన్ని సమూలంగా సంస్కరించగల మహనీయుల కృషి ఫలితాలను పొందే విజ్ఞత కూడా కరవయింది. చీటికీమాటికీ వేలు, లక్షలు ఖర్చు చేసి ఖరీదయిన ఆసుపత్రులలో వైద్యం పొందగల సంపన్నులకు, నిజాం ఆసుపత్రిలో ఉచిత చికిత్స పొందే అవకాశమున్న నాయకులకు, అధికారులకు సామాన్యుల కడగండ్లు కానరావు. లక్షలమంది పేదలు, అల్పాదాయ వర్గాలవారు చిన్నచిన్న జబ్బులకు కూడా సరైన వైద్యసౌకర్యం లేక, వైద్యం అందుబాటులో లేక సతమతమవుతున్నారు. సంపన్నులు, విద్యావంతుల కంటే చిన్న రుగ్మతలకు పేదలు ఎక్కువ ఖర్చుపెడుతున్నారు. అమూల్యమయిన కాలాన్ని పోగొట్టుకుంటున్నారు. జబ్బు పడుతున్నామనే భావనే సగటు మనుషుల్ని కుంగదీస్తోంది. ఒక్కోసారి జబ్బుపడితే- సగటు మనిషి తన సాంవత్సరిక ఆదాయంలో 60శాతాన్ని వైద్యానికే వెచ్చించాల్సి వస్తోందని అంచనా. వైద్యం అంత ఖరీదు అయిపోబట్టే ఆసుపత్రుల్లో చేరినవారిలో 40శాతం తమకున్న కొద్దిపాటి ఆస్తుల్ని అమ్ముకునో, ఎవరి దగ్గరన్నా వడ్డీకి డబ్బు తీసుకొనో ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆసుపత్రులపాలైన వారిలో 25శాతం మంది అలా ఖర్చు పెట్టిన తరువాత నిరుపేదలుగా మారుతున్నారు. అందరికీ ఆరోగ్యం అందించాలన్న సంకల్పం ఉండాలేగానీ, అతి తక్కువ ఖర్చుతో, స్థానికుల సహకారంతో ఎవరికీ తీసిపోని ఆరోగ్య ప్రమాణాలను సాధించటం చిటికెలో పని. ఆ ఫలితాలను అందరికీ అందించటం నాగరికులమనుకునే మన ప్రథమ కర్తవ్యం. బీదరికాన్ని నిర్మూలించాలంటే ఆరోగ్యాన్ని అందరికీ అందించే వ్యవస్థను నిర్మించాలి. ఒక వ్యక్తి పుట్టుక, కులం, హోదా, ఆస్తిపాస్తులు.. ఇందులో దేనితోనూ సంబంధం లేకుండా సహేతుకమైన, సరైన ప్రమాణాలుగల వైద్యసదుపాయాలు అందరికీ అందాలి.

(జేపీ 'భవిష్యత్ భారతం' కాలమ్‌లో భాగంగా 2002, 2004లో ఈనాడులో ప్రచురితమైన వ్యాసాల నుంచి)

వ్యాధి తృతీయదశలో జిల్లా స్థాయి వైద్య సంస్థలుంటాయి. ఈ దశ చికిత్సలో ఖర్చు ఎక్కువ ఫలితం తక్కువ ఉంటుంది కాబట్టి ఇక్కడ కార్పొరేట్ భాగస్వామ్యానికి అవకాశం లేకుండా ఈ నమూనాలో ఏర్పాట్లు ఉంటాయి. ఎయిమ్స్ (ఆలిండియా

ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) వంటి సంస్థలను, తక్కువ ఖర్చుతో మెరుగైన సేవల్ని అందించే శంకర నేత్రాలయ, నారాయణ హృదయాలయ వంటివాటిని మాత్రమే ప్రోత్సహిస్తారు. ఇప్పుడు జరుగుతున్నట్టు ప్రభుత్వం నుంచి కార్పొరేట్ ఆసుపత్రులకు వేలకోట్లు పంచిపెట్టటం ఉండదు.

■ గ్రామాల్లో కుటుంబ వైద్యుల ప్రాక్టీస్‌కు అనుమతినిచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే ప్రాంతీయ ఆరోగ్య ట్రస్టు ఉంటుంది. వైద్యసేవలను పర్యవేక్షించేందుకు జిల్లా బోర్డులు, తప్పు జరిగితే విచారణకు అంబుడ్స్‌మన్‌లు ఉంటాయి.

■ లోక్‌సత్తా అందరికీ ఆరోగ్యం నమూనా సరిగ్గా అమలయితే భారం లేకుండా అందరికీ వైద్యం, ఆరోగ్యం అందటమే కాకుండా, యువతకు రెండు కోట్ల ఉద్యోగావకాశాలు కూడా లభ్యమవుతాయి.

తాము ప్రతిపాదిస్తున్న అందరికీ ఆరోగ్యం నమూనాను అమలు చేస్తే వచ్చే 2022నాటికి ప్రాథమిక, నివారించదగ్గ వైద్యసేవలకు రూ.80,000 కోట్లు, రెండోదశ సేవలకు రూ.40,000కోట్లు, తృతీయదశ సేవలకు రూ.93,000కోట్లు ఖర్చవుతాయని జేపీ తెలిపారు. ద్రవ్యోల్బణాన్ని కూడా అంచనావేసి లెక్కిస్తే మొత్తం రానున్న ఏడేళ్లలో (దశలవారీ పెరుగుదలతో) రూ.3.5 – 3.8 లక్షల కోట్లు ఖర్చవుతాయని, ఇది జీడీపీలో కేవలం 1.67శాతం మాత్రమే ఉంటుందని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఇచ్చిన హామీ కంటే కూడా తక్కువ ఖర్చుచేస్తే చాలని అన్నారు. తాము అధికారంలోకి వస్తే ఆరోగ్య రంగానికి నిధుల్ని జాతీయ ఆదాయంలో 2.5శాతానికి పెంచుతామని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం చెప్పగా, 2.3 శాతానికి పెంచుతామని కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే ఎన్నికల హామీల్లో పేర్కొన్నాయని, లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ రూపొందించిన నమూనాలో ఇప్పుడు ఖర్చు చేస్తున్న 1.1శాతానికి మరో 1 శాతం లోపు కలిపి పెంచితే అందరికీ ఆరోగ్యం అందుతుందని వివరించారు. మనదేశంలో ఉన్న వైద్యసిబ్బంది నైపుణ్యాలు, చౌకగా మందుల తయారీ, సాంకేతికత, ప్రజల్లో డిమాండ్ వంటి సానుకూల అంశాలను ఉపయోగించుకుని తక్కువ ఖర్చుతో ఈ విధానాన్ని రూపొందించినట్టు చెప్పారు.

భారత ఆరోగ్యరంగానికున్న సంక్షోభానికి మూలం వ్యాధుల చికిత్సకన్నా నివారణకు కీలకమైన ప్రాథమిక ఆరోగ్య దశలో వైఫల్యమే ప్రధాన కారణమని జేపీ అన్నారు. గ్రామాలలో వైద్యసేవలు అందకపోవటం, ఏ జబ్బుచేసినా జిల్లా స్థాయి ఆసుపత్రులకు, బోధనాసుపత్రులకు రావాల్సిఉండటంతో ప్రయివేటు, కార్పొరేటు దోపిడీకి ప్రజలు బలవుతున్నారన్నారు. లోక్‌సత్తా, ఎఫ్‌డీఆర్ రూపొందించిన విధానంలో ఈ ప్రాథమిక వైద్యరంగంలో పూర్తిగా స్వేచ్ఛా మార్కెట్ పోటీ ఉంటుందని, ఎంతమంచి సేవలు అందించి ఎంతమంది ప్రజలను ఆకట్టుకుంటే ఆ వైద్యునికి అంత ఎక్కువ ఆదాయం లభిస్తుందని వివరించారు.

అందరికీ ఆరోగ్యం ఇవ్వాలని 12వ పంచవర్ష ప్రణాళికలో (2012-17) హామీ ఇచ్చినా ఒక నమూనాపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య ఏకాభిప్రాయానికి రాకపోవటం వల్ల ఇప్పటికీ ఆ కీలక సంక్షోభం అలాగే కొనసాగుతూ ఏటా ఐదేళ్లలోపు చిన్నారులు 12లక్షల మంది మరణిస్తున్నారని, 97 లక్షలమంది మలేరియా బారిన పడుతున్నారని, 25లక్షల మందికి టీబీ సోకుతోందని, ఆసుపత్రుల పాలయినవారు సగటున ఒక్కొక్కరూ రూ.40,000 ఖర్చు చేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని జేపీ ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో కేవలం 0.5శాతం పెంచితే ఈ దేశానికి అద్భుతాలు జరుగుతాయని, అందరికీ ఆరోగ్యం అందించటం కోసం ఆమాత్రం కూడా బడ్జెట్‌ను పెంచలేమని అంటే, ఇక ప్రభుత్వాలు అక్కర్లేదన్నారు. తాయిలాలు, రుణమాఫీలు వంటి పథకాలుకాకుండా అందరికీ నాణ్యమైన చదువు, ఆరోగ్యం ఉచితంగా ప్రభుత్వమే అందించే బాధ్యత తీసుకుంటేనే పేదరికం, వివక్ష తొలగిపోయి ప్రతి బిడ్డకూ ఎదిగే అవకాశాలు వస్తాయని తొలినుంచీ వాదిస్తూ జాతీయ ఆరోగ్య మిషన్ ద్వారా కొన్ని ఫలితాలను లోక్‌సత్తా సాధించిందని, తాజాగా పూర్తిస్థాయి ఫలితాల కోసం కృషి చేస్తున్నామని తెలిపారు.

కేంద్ర, అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలతో, పార్టీలతో కూడా కూర్చుని నిర్మాణాత్మక వాదనలతో ఒప్పించి సరైన పద్ధతుల్లో, భారం లేకుండా అందరికీ ఆరోగ్యాన్ని సాధించేందుకు దృఢసంకల్పంతో ప్రయత్నిస్తున్నామని, తిరిగి ఎన్నికైన మోదీ ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్‌లో ఈ దిశగా మార్పులు తెస్తుందని ఆశిస్తున్నామని, ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ గళం విప్పాలని జయప్రకాష్ నారాయణ్ విజ్ఞప్తి చేశారు.

(నీతి ఆయోగ్ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి ఎఫ్‌డీఆర్/లోక్‌సత్తా అందించిన అందరికీ ఆరోగ్యం విధానం నమూనా పూర్తి వివరాల్ని www.fdrindia.org లో చూడవచ్చు) ◆

# 'స్టార్టప్'.. మేకింగ్ ఆఫ్ మహాత్మా!

**గాంధీజీ 150వ జయంతి సంవత్సరం ప్రారంభమైనప్పుడే.. ఆయన్ను మహాత్ముడిగా మలిచేందుకు పునాది వేసిన చరిత్రాత్మక ఘటన 125 ఏళ్లు పూర్తిచేసుకుంది.**

**దాదాపు నూటపాతికేళ్ల క్రితం మోహన్‌దాస్ కరమ్‌చంద్ గాంధీ దక్షిణాఫ్రికాలో అడుగుపెట్టారు. పీటర్‌మారిట్జ్‌బర్గ్ రైల్వేస్టేషన్‌లో ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్‌లో నుంచి గెంటివేతకు గురయ్యారు. ఆ సంఘటన నుంచే గాంధీలోని నాయకత్వ శక్తి మేలుకొంది. గాంధీ అనే ఒక సాధారణ న్యాయవాది.. మహాత్మాగాంధీ అనే గొప్ప దార్శనిక నాయకునిగా రూపుదిద్దుకున్నారు. మొదటిశ్రేణి ప్రయాణానికి పనికిరావని విసిరేసిన దేశంలోనే విశ్వశ్రేణి నాయకునిగా నీరాజనాలు అందుకుంటున్నారు.**

**గాంధీని మహాత్ముడిగా తీర్చిదిద్దే ప్రయాణానికి నాంది పలికిన మారిట్జ్‌బర్గ్ రైల్వేస్టేషన్ అనుభవం ఒక కీలకఘట్టంగా.. ఆ ఘటన జరిగిన జూన్ 7, 1893 ఒక ముఖ్యమైన రోజుగా ప్రపంచ చరిత్రలో మిగిలిపోయాయి.**

**తన ఆత్మకథ 'సత్యశోధన'లో మహాత్ముడు ఆ సంఘటనను కళ్లకు కట్టినట్టు గాంధీజీ రాసుకున్నారు. ఆయన మాటల్లోనే ఆరోజు ఏం జరిగిందంటే...**

'దక్షిణాఫ్రికాకు వచ్చిన ఏడో రోజునో, ఎనిమిదో రోజునో... నేను దర్బన్ నుంచి బయల్దేరాను. నా చేతిలో మొదటితరగతి టికెట్టు ఉంది. పరుపు కావాలంటే అదనంగా ఐదు షిల్లింగులు చెల్లించాలి. పరుపు తీసుకోమని అబ్దుల్లా గారు మరీ మరీ చెప్పారు. ఆయన కేసుల్ని కొలిక్కి తెచ్చేందుకే భారతదేశం నుంచి ఇంతదూరం వచ్చాన్నేను. రైల్లో పరుపు తీసుకోకూడదనే అనుకున్నా. ఎలాగోలా సర్దుకుపోతే నాలుగు డబ్బులు మిగుల్తాయన్న ఆశ.

నా ఆలోచన అర్థమైనట్టుంది. "ఏం ఫర్వాలేదు. అల్లా అనుగ్రహం వల్ల తినడానికి, కట్టడానికి, ఇతరులకు సాయం చేయడానికి తగినంత సంపాదిస్తున్నా. మీరేం సంకోచించకండి. నిరభ్యంతరంగా ఖర్చు చేయండి" అని నచ్చజెప్పారు.

అయినా నేను విన్లేదు.

రాత్రి తొమ్మిదింటికి పీటర్‌మారిట్జ్‌బర్గ్ స్టేషన్‌కు చేరుకుంది రైలు. పడుకునేవాళ్లకు ఇక్కడే పరుపులిస్తారు. జవాను వచ్చి 'పరుపు కావాలా?' అని అడిగాడు.




'నా దగ్గరుంది. అక్కర్లేదు' అని చెప్పాను.

మాట్లాడకుండా వెళ్లిపోయాడు. ఇంతలోనే ఓ ప్రయాణీకుడు లోపలికొచ్చాడు. నా వైపు ఎగాదిగా చూశాడు. హావభావాల్ని బట్టే అర్థమైపోయింది. నేను నల్లవాడినన్న చులకన. నేనక్కడ కూర్చోవడాన్ని సహించలేకపోయాడు. కొంపలు మునిగి పోతున్నట్టు... కంగారు కంగారుగా వెళ్లిపోయాడు. కాసేపటికి నలుగురైదుగురు ఉద్యోగుల్ని వెంటబెట్టుకుని వచ్చాడు. అంతా నా చుట్టూ చేరారు. 'నీకే చెప్పేది. సీటు ఖాళీ చేసి వెనక్కి వెళ్లిపో...' గద్దించాడొకడు. మిగిలినవాళ్లంతా, నా రంగు గురించీ నా ఆహార్యం గురించీ చులకనగా మాట్లాడుతున్నారు. వెకిలి నవ్వులు నవ్వుతున్నారు.


ఆ మాటలు నేను పట్టించుకోలేదు.


'నా దగ్గర మొదటి తరగతి టికెట్ ఉంది. దర్బన్‌లో నన్నిక్కడ కూర్చోనిచ్చారు. కదిలే ప్రసక్తే లేదు' వినయంగానే అయినా స్థిరంగా జవాబిచ్చాను.

ఆ మాటకు మండినట్టుంది.

'అయితే పోవన్నమాట. పోలీసుల్ని పిలుస్తాం. వాళ్లే గొంతు పట్టుకుని నెట్టేస్తారు' గట్టిగట్టిగా అరిచాడొకడు.

'నెట్టితే నెట్టనీ. నేను మాత్రం వెళ్లను' అంతే మొండిగా మాట్లాడాను.




పోలీసు రానే వచ్చాడు. నా చేయి పట్టుకుని లాక్కెళ్లినంత పని చేశాడు. కంపార్ట్‌మెంట్‌లోంచి కిందికి దించేశాడు. నా సామాన్లు విసిరేశాడు.

'వెళ్లిపో... వెనుకపెట్టె ఎక్కు...' కసురుతూ చెప్పాడు.

నేను కదల్లేదు.

రైలు కూతపెడుతూ ముందుకెళ్లింది. సామానంతా చెల్లాచెదురై పోయింది. పోలీసులు అక్కడ కాపలాగా నిలబడ్డారు. చేతిసంచి మాత్రం అందుకుని వెయిటింగ్‌రూమ్ వైపు నడిచాను.

అది చలికాలం. దక్షిణాఫ్రికాలోని పర్వత ప్రాంతంలో చలి ఎక్కువ. మారిట్జ్‌బర్గ్ ఎత్తు మీద ఉంటుంది. నా ఓవర్‌కోటు సామాన్లలో ఉండిపోయింది. ఇమ్మని అడిగితే వెటకారంగా మాట్లాడతారేమో! అవమాన భయంతో ఆ ప్రయత్నం మానుకున్నాను. నిముష నిముషానికీ చలి తీవ్రత పెరిగింది. ఆ గదిలో దీపం లేదు. చిమ్మ చీకటి. పరిసరాల్లో మనుషుల జాడే లేదు. అర్ధరాత్రి సమయంలో అడుగుల కదలికలు. ఓ ప్రయాణీకుడు అక్కడికొచ్చాడు. నన్ను పలకరించాలని చూశాడు. నేను మాట్లాడే స్థితిలో లేను. నా ఆలోచనలు మాత్రం చురుగ్గా సాగిపోతున్నాయి.

## పీటర్‌మారిట్జ్‌బర్గ్ పశ్చాత్తాపం

పశ్చాత్తాపాన్ని మించిన శిక్షే లేదంటాడు మహాత్ముడు. ఆ పశ్చాత్తాప చిహ్నంగానే గాంధీజీ 142వ జన్మదినోత్సవం సందర్భంగా మారిట్జ్‌బర్గ్ రైల్వేస్టేషన్ తన పేరును 'గాంధీ రైల్వే స్టేషన్'గా మార్చుకుంది.

'7 జూన్, 1893న..

ఇక్కడే ఎం.కె గాంధీని ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంట్ నుంచి గెంటేశారు. ఆ సంఘటన ఆయన జీవితాన్నే మార్చేసింది. జాతి వివక్షకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించారు. అహింసా ఉద్యమానికి ఆరోజే బీజం పడింది'.. అంటూ తన నుదుట శిలాశాసనం లిఖించుకుంది. ఆ ఎర్ర ఇటుక కట్టడంలోని ఆత్మసౌందర్యమే ఇప్పుడు ప్రపంచ యాత్రికుల్ని ఆకర్షిస్తోంది.

ఇప్పుడేం చేయాలి?

హక్కుల కోసం పోరాడాలా?


నోరు మూసుకుని, భారతదేశానికి తిరిగి వెళ్లిపోవాలా?

వచ్చిన పని పూర్తి చేయకుండా వెళ్లలేను. అంతకు మించిన అవమానం ఉండదు. అది పిరికివాళ్ల లక్షణం. అయినా, నేను పడిన కష్టం చాలా చిన్నది. ఇదో తీవ్రరోగం తాలూకు చిన్న లక్షణం మాత్రమే. చేతనైతే.. రోగమూలాల్ని పెకలించి వేయాలి. ఆ ప్రయత్నంలో కష్టాలు ఎదురైతే భరిస్తాను. అవమానాలు వెంటాడితే తట్టుకుంటాను.

ఓ నిర్ణయానికి రాగానే, ఎక్కడలేని తెగింపు వచ్చింది. కొండల్ని పిండి చేయగల ధైర్యం సమకూరింది. వచ్చే రైల్లో ప్రిటోరియాకు వెళ్లాలని అనుకున్నాను. మరుసటి రోజు, రైల్వే జనరల్ మేనేజర్‌కు ఓ నిరసన టెలిగ్రామ్ పంపాను. అబ్దుల్లా గారికి కూడా సమాచారం చేరవేశాను.

ఆయన వెంటనే జనరల్ మేనేజర్‌ను కలిసి మాట్లాడారట. 'విషయం నా దృష్టికి వచ్చింది. ఇందులో రైల్వేవాళ్ల తప్పేం లేదు' అని జనరల్ మేనేజర్ చెప్పినట్టు తెలిసింది.

'గాంధీగారు స్టేషన్‌లో ఉన్నారు. ఆయనకు సాయం చేయండి' అంటూ అబ్దుల్లాగారు మారిట్జ్‌బర్గ్‌లోని భారతీయ వర్తకులకు తంతి పెట్టారు. వాళ్లంతా ఆందోళనపడుతూ స్టేషనుకు వచ్చారు. నన్ను ప్రేమగా పలకరించారు. ఏం జరిగిందో తెలుసుకున్నారు. తమకు జరిగిన అవమానాల గురించి చెప్పారు. ఆ వివక్షను




తలుచుకుంటున్నప్పుడు... వెక్కివెక్కి ఏడ్చినవారూ ఉన్నారు. 'ఏం ఫర్వాలేదు. ఈ దేశంలో ఇవన్నీ సాధారణమే...' అంటూ నన్ను ఊరడించే ప్రయత్నం చేశారు. ఆ రోజంతా వాళ్ల మధ్యే గడిచిపోయింది. రాత్రికి రైలు వచ్చింది. చార్లెస్‌టౌన్‌కి బయల్దేరాను.

– – –

బండి తెల్లారేసరికి గమ్యానికి చేరింది. అప్పట్లో చార్లెస్‌టౌన్, జొహానిస్‌బర్గ్‌ల మధ్య రైళ్లు లేవు. గుర్రపుబండ్లే దిక్కు. బండి తోవలో స్టాండర్టన్ అనే దగ్గర ఆగుతుంది. నా దగ్గర గుర్రపు బండి టికెట్ ఉంది. మారిట్జ్‌బర్గ్‌లో నేను ఒక రోజంతా ఉండిపోయాను. అయినా టికెట్ రద్దు కాలేదు. అబ్దుల్లా కూడా చార్లెస్‌టౌన్‌లోని గుర్రపుబండ్ల ఏజెంట్‌కు తంతి పంపారు. కానీ వాడు సరైన మనిషి కాదు. నన్ను దోచుకోవాలని చూశాడు. 'నీ టికెట్ చెల్లదు' అని గొడవ పెట్టుకున్నాడు. నేను తగిన సమాధానమే ఇచ్చాను. అంతలోనే గుర్రపుబండ్ల అధికారి నేను తెల్లవారి పక్కన కూర్చోకుండా ఏదో మెలిక పెట్టాడు. బండి తోలేవాడి దగ్గర సర్దుకోమన్నాడు. నాకు ఇబ్బందిగా అనిపించింది. అయినా, సహనంతో వ్యవహరించాను. తిరగబడితే, నన్ను అక్కడే వదిలేసి వెళ్లినా వెళ్లగలడు. అదే జరిగితే చేయగలిగిందేం లేదు. నా సమయమే వృథా అవుతుంది. దార్లో గుర్రపుబండి అధికారికి ఓ వింత కోరిక పుట్టింది. నేను కూర్చున్నచోట కూర్చోవాలనే కోరిక కలిగింది. సిగరెట్ కాల్చుకోవడానికి అక్కడైతే అనువుగా ఉంటుంది.

**దక్షిణాఫ్రికా అనుభవాలతోనే కాంగ్రెస్ నిర్మాణం**

దక్షిణాఫ్రికాలో బెంగాలీలు, గుజరాతీలు, తమిళులు, తెలుగువారు.. ఇలా అన్ని భాషలవారితో పరిచయం ఏర్పడింది గాంధీజీకి. ఆ అవగాహనతోనే భారతదేశానికి వచ్చాక.. కాంగ్రెస్ పార్టీని భౌగోళికత ఆధారంగా కాకుండా, భాషల్ని బట్టి పునర్వ్యవస్థీకరించారు. మహాత్ముడిని జాతిపితగా తీర్చిదిద్దిన అనుభవాలు దక్షిణాఫ్రికాలో అనేకం.

**–'గాంధీ బిఫోర్ ఇండియా' రచయిత రామచంద్ర గుహ**

మంచి గాలీ తగుల్తుంది. మరి నా సంగతి? ఓ పాత గోనెసంచి పరిచి... తన కాళ్ల దగ్గర కూర్చోమన్నాడు. ఆ అవమానాన్ని తట్టుకోలేకపోయాను.

'ఇది అన్యాయం. లోపల కూర్చోవాల్సినవాడిని ఇక్కడ కూర్చోబెట్టావ్. ఇప్పుడేమో, నీ కాళ్లదగ్గరా? కుదర్దు' ... ఎదురుతిరిగాను.

నేనలా మాట్లాడేసరికి, ఆవేశంతో ఊగిపోయాడు. నా చెంప పగలగొట్టాడు. కిందికి ఈడ్చి పడేయబోయాడు. నేను ప్రాణభయంతో బండి చువ్వల్ని గట్టిగా పట్టుకున్నాను. అవతలివాడేమో అంతెత్తు మనిషి. ఏనుగులా ఉన్నాడు. నేనా దుర్బలుడిని. నా పరిస్థితి చూసి తోటి ప్రయణీకులకు జాలేసినట్టుంది. 'పాపం! అతడ్ని విడిచిపెట్టు. చచ్చిపోయేలా ఉన్నాడు. అక్కడ కాకపోతే, మా దగ్గరికి పంపు. మాకేం ఇబ్బంది లేదు' అని మందలించారు.

వాళ్లలా మాట్లాడేసరికి వాడి అహం దెబ్బతిన్నట్టుంది. 'నీ అంతు చూస్తా...' అని చూపులతో హెచ్చరించాడు. దార్లో గుర్రుమంటూ చూస్తూనే ఉన్నాడు. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణించాను. చీకటిపడే సమయానికి బండి స్టాండర్టన్ చేరింది. అక్కడక్కడా భారతీయుల మొహాలు కనిపించడంతో, కాస్త ధైర్యం వచ్చింది. కాలు కింద పెట్టగానే, 'మేం మీ కోసమే వచ్చాం. అబ్దుల్లా గారు పంపారు' అంటూ




The turning point of Gandhiji's life. Just because he was a non-white, Gandhiji was thrown out of a train in South Africa, inspite of possessing a first class ticket.
Photo courtesy : Aditya Chichkar

పలకరించారంతా. చాలా సంతోషంగా అనిపించింది. దుకాణానికి వెళ్లాక జరిగిందంతా చెప్పాను. చాలా బాధపడ్డారు. తమ కష్టాల్నీ పంచుకున్నారు. నన్ను ఓదార్చారు. నేనూ వాళ్లను ఓదార్చాను.

ఆ సంఘటన గురించి గుర్రపు బండ్ల కంపెనీకి లేఖ రాశాను. 'తిరుగు ప్రయాణంలో అంతకంటే పెద్దబండి ఏర్పాటు చేస్తామనీ, పాతవాడు ఇక రాడనీ' జవాబిచ్చారు. ఊపిరి పీల్చుకున్నాను. కొట్టినవాడి మీద కేసు పెట్టే ఉద్దేశం లేదు కాబట్టి, అక్కడితో వ్యవహారం సమసిపోయింది. మరుసటిరోజు రాత్రికి జోహానిస్‌బర్గ్ చేరుకున్నాను. అక్కడ ఏదైనా హోటల్‌లో బస చేయాలని ఆలోచన. బండి మాట్లాడుకుని గ్రాండ్ నేషనల్ హోటల్‌కి వెళ్లాను. మేనేజర్ని కలిసి ఓ గది కావాలని అడిగాను. ఆయన నావైపు అదోలా చూసి, 'ఖాళీ లేవు' అని చెప్పాడు. ఆ తర్వాత, ఆ విషయాన్ని అక్కడి భారతీయులు అబ్దుల్‌గనీగారితో చెప్పాను. 'హోటల్లో మీకెలా ప్రవేశం లభిస్తుందని అనుకుంటున్నారు?' అంటూ పకపకా నవ్వేశారు.

'ఎందుకిలా మాట్లాడు తున్నారు?'... మరింత లోతుగా చర్చించే ఉద్దేశంతో అడిగాను. 'ఏం చెప్పమంటారు? కొన్నాళ్లుపోతే మీకే అర్థం అవుతుంది. మేం ఈ దేశంలో గతిలేక ఉంటున్నాం. పొట్ట నింపుకోడానికి పుట్టెడు అవమానాలు భరిస్తున్నాం'... వాస్తవ పరిస్థితుల్ని వివరించారు. 'వివక్షని మీరెప్పుడూ ప్రశ్నించలేదా?' – అడిగాను. 'ఎవర్ని ప్రశ్నిస్తాం...' ఆయన గొంతులో నిర్వేదం.

అంతలోనే మళ్లీ ప్రిటోరియా వెళ్లాల్సిన అవసరం పడింది. బండి మీద అయితే

**గాంధీ గురించిన ఆలోచనే వేయి ఏనుగుల బలాన్నిచ్చింది**

బలమైన చేతులు నెట్టేసినప్పుడు.. రైలు పెట్టెలో నుంచి పడిపోతున్న సమయానికి గాంధీజీ.. దక్షిణాఫ్రికాను సందర్శిస్తున్న ఓ మామూలు భారతీయుడు మాత్రమే. పైకి లేస్తున్నప్పుడు మాత్రం.. అతనో సౌతాఫ్రికా భారతీయుడు. మహాత్ముడు శిక్ష అనుభవించిన జైల్లోనే నేనూ ఉన్నాను. 'బాపూ ఇక్కడే కూర్చుని ఉంటారు, ఇక్కడే ప్రజల గురించి ఆలోచించి ఉంటారు, ఈ గాలే పీల్చుకుని ఉంటారు' అన్న ఆలోచనే వేయి ఏనుగుల బలం ఇచ్చింది.

**– నెల్సన్ మండేలా**

**(మండేలా శతజయంతి ఉత్సవాలూ గతేడాది మొదలయ్యాయి)**

చాలా ఖర్చు అవుతుంది. సమయమూ వృధా. మొదటి తరగతి ప్రయాణమే ఉత్తమం. ఆ మేరకు స్టేషన్ మాస్టర్‌కి ఉత్తరం రాశాను. 'మీకు టికెట్టు ఇస్తాను. కానీ మధ్యలో గార్డు దించేస్తే మాత్రం నేను చేయగలిగిందేం లేదు. రైల్వే వాళ్ల మీద దావా వేయకూడదు' అంటూ సవాలక్ష నిబంధనలు పెట్టి టికెట్ చేతికిచ్చాడు. అనుకున్నట్టే గార్డు వచ్చాడు. మూడో తరగతి పెట్టెలోకి వెళ్లిపొమ్మంటూ దురుసుగా సైగ చేశాడు. నేను కూడా అంతే తిరస్కారంగా తల ఊపాను. ఈసారి కోపంతో గొంతు పెంచాడు. ఈ బోగీలో నేను కాకుండా, మరో తెల్లదొర ఉన్నాడు. 'ఎందుకలా అతడిని ఇబ్బంది పెడతావ్? ఫస్ట్‌క్లాస్ టికెట్ కొన్నాడుగా! ఆయన పక్కన కూర్చోడానికి నాకేం సమస్య లేదు' అని దబాయించేసరికి తోక ముడిచాడు.

'కూలీ పక్కన కూర్చోవడం అంతిష్టమైతే అలాగే కూర్చోండి' అని గొణుక్కుంటూ వెళ్లాడు. నేను గమ్యానికి చేరాను. నా ఆలోచనలేమో మజిలీ లేకుండా ప్రయాణిస్తున్నాయి.

.......

గాంధీజీ ఓ శిల అయితే, దక్షిణాఫ్రికా అవమానాలు ఉలి దెబ్బలు. రాటుదేలేలా చేశాయి.






ప్రశ్నించడం నేర్పాయి. కొట్టారు, తిట్టారు, గొంతుపట్టి నెట్టేశారు, 'పిలవని పేరంటగాడు' (అన్‌వెల్‌కమ్ విజిటర్) అని పత్రికలు గేలి చేశాయి. వ్యంగ్య చిత్రాలు ప్రచురించాయి. ఆ చేదు అనుభవాల్లో నుంచే గాంధీ అనే బారిస్టరు సత్యాగ్రహ యోధునిగా, జాతిపితగా, మహాత్మునిగా అవతరించారు. స్పష్టతతో, సంఘటితంగా, అహింసాయుతంగా పోరాడితే ఎంత పెద్ద సమస్యనైనా మానవాళి పరిష్కరించుకోవచ్చని చాటిచెప్పారు. నూతన భారతదేశ నిర్మాణానికి నాంది పలికారు. ◆

# మన ఫార్మారంగం ఫలితాల్ని 'ప్రజలందరికీ ఖర్చు లేని మంచి ఆరోగ్యం' కోసం సద్వినియోగం చేయాలి





మన ఫార్మారంగం ప్రపంచంలోనే ఉన్నతస్థానానికి చేరుకుందని, అయితే దాన్ని మన ప్రజల కోసం పూర్తిస్థాయిలో వినియోగించుకునే ప్రయత్నాన్ని పాలకులు చేయటం లేదని జేపీ అన్నారు. భారత ఫార్మారంగమే లేకుంటే ఎయిడ్స్ వ్యాధి మరణాలు ఊహించనంతగా పెరిగి ఉండేవన్నారు. భారతీయులు తక్కువ ధరకు మందులు అందించటం వల్లే మిగిలినదేశాల్లో ఆ వ్యాధిగ్రస్తులు బతికిబట్టకడుతున్నారన్నారు. ఇండియా వాళ్లు తక్కువ ధరకు మందులెలా ఇస్తారని విదేశీ కంపెనీలు పళ్లు నూరుతున్నాయన్నారు.

జనం కోసం జేపీ సురాజ్య యాత్రలో భాగంగా భీమవరంలోని శ్రీ విష్ణు ఫార్మసీ కళాశాలల గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో జయప్రకాష్ నారాయణ్ పాల్గన్నారు. ఫార్మా, వైద్యరంగాలకు సంబంధించి మెరుగైన పద్ధతులపై విద్యార్థులతో మాటామంతీ నిర్వహించారు.

మన ఫార్మారంగం ఇచ్చిన అవకాశాన్ని స్వదేశీ పాలకులు కూడా సద్వినియోగం చేయాలని జేపీ అన్నారు. జనరిక్ ఔషధాలను ప్రాచుర్యంలోకి తేవాలన్నారు. మనకున్న నిపుణులైన వైద్యసిబ్బందిని, చౌక మందులను ఉపయోగించుకుని ప్రాథమిక స్థాయిలో ఫ్యామిలీ డాక్టర్ పద్ధతి చుట్టూ ఆరోగ్య విధానాన్ని ప్రభుత్వం అమలుచేస్తే.. జేబులో నుంచి రూపాయి ఖర్చు లేకుండా ప్రజలందరికీ నాణ్యమైన వైద్యం అందుబాటులోకి రావటంతోపాటు, అదనంగా 1 కోటి పైగా ఉద్యోగాలు యువతకు లభిస్తాయన్నారు.

శ్రీ విష్ణు డెంటల్ కళాశాల ఆధ్వర్యంలో కృష్ణా జిల్లా గన్నవరంలో పదవ క్లినిక్‌ను ఏర్పాటు చేసినట్టు విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ ఛైర్మన్ కేవీ విష్ణురాజు తెలిపారు. డెంటల్ క్లినిక్‌ల సంఖ్యను 100కు పెంచి రాష్ట్రమంతటా సేవలందించాలనే సంకల్పంతో ఉన్నట్టు చెప్పారు. జేపీ సూచించినట్టు.. విద్యార్థులు తమ కెరీర్‌ను, సమాజ ప్రయోజనాలనూ బ్యాలెన్స్ చేసుకుంటూ ముందుకు సాగాలని వైస్ ఛైర్మన్ రవిచంద్రన్ సూచించారు.

కార్యక్రమంలో ఫార్మసీ విద్యాసంస్థ డైరెక్టర్ డాక్టర్ డి.బసవరాజు, ప్రిన్సిపల్ డాక్టర్ కె.ప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ ప్రసాదరాజు, లోక్‌సత్తా, వైబీఐ నేతలు పాల్గొన్నారు. ◆

# కుల, మత రాజకీయ విభజన సుస్పష్టం



ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో కులం, మతం, తాయిలాల పథకాలు, డబ్బు ప్రభావం పెద్ద ఎత్తున ఉందని... పేదరికాన్ని నిర్మూలించి ప్రజల జీవితాల్ని బాగు చేసే విద్య, ఆరోగ్యం వంటి విధానాలు, మౌలిక సదుపాయాల చర్చే లేదని లోక్‌సత్తా పార్టీ వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్ అన్నారు. మతం పేరుతో దేశంలోని అనేకచోట్ల, కులం పేరుతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో రాజకీయ విభజన సుస్పష్టంగా కనిపించిందన్నారు. ప్రజల భవిష్యత్తును నాశనం చేసేలా అర్థం లేని ఉచితాలు, తాయిలాలకు డబ్బును పందేరం చేస్తూ నేనిచ్చా... నేనొస్తా.. నేనిస్తా' అని తమ జేబులో సొమ్మేదో దానం చేస్తున్నట్లు నేతలు వ్యవహరిస్తున్నారన్నారు. తెదేపా పార్టీ అధికారంలో ఉంటే కమ్మ కులస్తులకు, వైకాపా అధికారంలో ఉంటే రెడ్డి కులస్తులకు ప్రయోజనం జరుగుతుందనుకోవటం భ్రమన్నారు. ఒకస్థాయిలో ఉన్నవారికి, రాజకీయ వ్యాపారులకు మాత్రమే కులం ద్వారా లబ్ధి కలిగే అవకాశముందని, మిగిలినవారికి కులం కూడుపెట్టదని అన్నారు. రాష్ట్రం కులాల కురుక్షేత్రంగా మారతోందని, దీనిపై జాగ్రత్తపడాలని గత ఐదేళ్లుగా తాను హెచ్చరిస్తూనే ఉన్నానన్నారు.

విజయవాడలో లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో దిశానిర్దేశం చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

ఆంధ్రప్రదేశ్ ఆర్థిక సంక్షోభంలో ఉందని, కేంద్రం నుంచి రావాల్సిన నిధుల్ని రాబట్టుకోవటానికి జగన్ ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేయాలని జేపీ అన్నారు. ఇందుకోసం అందరినీ కలుపుకుని వెళ్లాలన్నారు. మొదట చంద్రబాబు, ఆ తర్వాత జగన్ పంతాలకు పోకుండా ఉంటే ప్రత్యేక హోదా, ఇతర విభజన హామీలపై ఇంత సంకటస్థితి వచ్చేది కాదన్నారు.

విభజన హామీల ద్వారా ఏపీకి రావాల్సిన నిధులపై లోక్‌సత్తా/ఎఫ్‌డీఆర్ చొరవతో రూపొందించిన నివేదికను తెలుగేతర జాతీయ స్థాయి నిపుణులు కూడా ఆమోదించారని, దీన్ని ఉపయోగించుకుని ఒడుపుగా నిధుల్ని రాబట్టుకోవాలని జేపీ సూచించారు. పోలవరం, హోదా పన్ను రాయితీలు కాకుండా.. రాష్ట్రానికి రూ.80,000 కోట్లు రావాల్సి ఉందని, రాష్ట్ర బకాయిల్లో చెల్లుబెట్టుకోవటం, బాండ్‌లను జారీ చేయటం ద్వారా ఈ డబ్బుని కేంద్రం భర్తీ చేయవచ్చన్నారు. తెలుగుదేశం పార్టీ కూడా కొత్త ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టకుండా రాష్ట్ర ప్రయోజనాల కోసం కలిసి పనిచేయాలన్నారు.

తలసరి ఆదాయంలో ఏపీ దక్షిణాది రాష్ట్రాలన్నిటికన్నా వెనుకబడి ఉందని, ఆదాయాన్ని, ఉపాధి అవకాశాల్ని పెంచేందుకు, కుల విభజనల్ని తొలిగించేందుకు కొత్త ప్రభుత్వం కృషి చేయాలని జేపీ సూచించారు. పేదలు సరిగ్గా చదువుకుంటే తమను ప్రశ్నిస్తారని విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తున్నట్లు కనిపిస్తోందన్నారు. అందరికీ నాణ్యమైన విద్య, ఆరోగ్యాలు అందుతూ స్థానిక స్థాయికి అధికార వికేంద్రీకరణ జరిగితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని జగన్ ప్రభుత్వం గుర్తించాలని జేపీ అన్నారు.

Posting Date 07-06-2019
RNI.Reg. No. APTEL/2010/32219 Postal Reg. No. HD/1126/2019-21 Published on June 1st, 2019



# ఎఫ్‌డీఆర్ 2019 వేసవి బ్యాచ్

ఆలోచనల్ని పంచుకునేందుకు, చర్చించేందుకు ప్రజాస్వామ్య పీఠం (ఫౌండేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫార్మ్స్-ఎఫ్‌డీఆర్), లోక్‌సత్తా వ్యవస్థాపకుడు డా॥ జయప్రకాష్ నారాయణ్‌తో సమావేశంలో ఎఫ్‌డీఆర్ 2019 వేసవి బ్యాచ్ పరిశోధకులు

| Book-Post<br>PRINTED MATTER | To |
|---|---|
| If not delivered please return to:<br><br>Lok Satta Times<br>Tulips Apartment,<br>6-3-655, Flat.No. 407,<br>Behind Civil Supplies Office,<br>Somajiguda<br>Hyderabad- 500082 | |

Edited, Printed & Published at Hyderabad by Dr. Jayaprakash Narayan, Flat No. B. 504, Pasha Court, Somajiguda, Hyderabad - 500 082, Printed at Kala Jyothi Process Pvt., Ltd., 1-1-60/5, RTC"X" Roads, Hyderabad